ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 30.0
కనిష్ఠం: 16.0



ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావుకు వినతి పత్రం అందిస్తున్న వివిధ యూనియన్ల రాష్ట్ర నాయకులు

దిగొచ్చిన ఆర్టీసీ యాజమాన్యం

- ఉద్యోగుల సస్పెన్షన్‌పై మరో విచారణ
- ఎండీ ద్వారకాతిరుమలరావు హామీ
- 12 రోజుల ఉద్యోగుల ఆందోళన విరమణ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఏలూరు నగరంలోని ఆర్టీసీ పెట్రోల్ బంకులో నిధుల దుర్వినియోగం వ్యవహారంపై ఆర్టీసీ యాజమాన్యం దిగివచ్చింది. బంకులో రూ.83 లక్షలు దుర్వినియోగం విషయంలో 14 మంది బాధ్యులైతే.. నలుగురి ఉద్యోగులనే సస్పెండ్ చేయడంపై ఉద్యోగ సంఘాలు ఆందోళనకు ఉపక్రమించాయి. 12 రోజులుగా వివిధ యూనియన్ల ఆధ్వర్యంలో ఏలూరు డిపో ముందు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు గురువారంతో తెరపడింది. జిల్లా పర్యటనలో భాగంగా జంగారెడ్డిగూడెం వచ్చిన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఈ అంశంపై దృష్టి సారించారు. ఉద్యోగ సంఘాల నాయకులను విజయవాడ రప్పించుకుని విషయం ఆరా తీసినట్టు సమాచారం. ఈ విషయంలో రాష్ట్ర సంఘాలు బాధ్యత తీసుకుని ద్వారకాతిరుమలతో శుక్రవారం చర్చించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని నాయకులకు ఎండీ హామీ ఇచ్చారని ఏలూరు డిపో జేఏసీ నాయకుడు వై.శ్రీనివాసరావు తెలిపారు. కాగా బంకు నిధులు దుర్వినియోగంలో 14 మందిపై అధికారులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఇందులో ఆరుగురికి సంబంధించిన సమాచారాన్ని డీపీటీవోకు అప్పగించారు. మిగతావారి నివేదికలను అందించాకే విచారణాధికారి నియామకాన్ని ఎండీ చేపట్టే అవకాశం ఉంది.

అర్జీలు నిర్లక్ష్యం చేస్తే సస్పెండ్ చేస్తా : కలెక్టర్



ఏలూరు,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి):పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలే కాకుండా సస్పెండ్ చేస్తానంటూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో శనివారం పీజీఆర్ఎస్ అర్జీలు, 22ఏ కేసులు, అడంగళ్లు, ఇంటి స్థలాలు, రీ సర్వే, ఐవీఆర్ఎస్ తదితర అంశాలపై సమీక్షించారు. ప్రగతిలో వెనుకబడిన తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. నిర్ణీత సమయాల్లో లక్ష్యాలు పూర్తి చేయకపోతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. జేసీ అభిషేక్ గౌడ, డీఆర్వో విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్ వినూత్న,ఆర్డీవోలు అచ్యుత అంబరీష్, రమణ, డిప్యూటీ కలెక్టర్ దేవకిదేవి, సర్వే ఏడీ అన్సారీ పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన

మహనీయుడు అంబేడ్కర్

- మంత్రి పార్థసారథి

చాట్రాయి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):భారత దేశానికి రాజ్యాంగాన్ని రచించి, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు అంబేడ్కర్ అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కొనియాడారు. మండలంలోని చనుబండ శివారు కరుణాపురంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరితో కలిసి శనివారం ఆవిష్కరించారు. అనంతరం బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బుర్రి శ్రీకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులు ఉపయోగించుకొని ప్రతి ఒక్కరు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ఆర్థిక అసమానతలు తొలగేలా అందరూ కలిసి పోరాడాలని కోరారు. సర్పంచ్ జ్యోతి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులు అర్పిస్తున్న మంత్రి కొలుసు, తపన చౌదరి

దివ్యాంగులకు.. వరం!



ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు తీపికబురు చెప్పింది. మహిళల మాదిరిగానే ఆర్టీసీలో వీరికి ఉచిత ప్రయాణాల వర్తింపునకు నిర్ణయించింది. ఈ మేరకు దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇప్పటి వరకు వీరంతా టిక్కెట్‌లో 50 శాతం రాయితీ పొందుతున్నారు. త్వరలో వీరికి పూర్తిస్థాయిలో ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్టు ప్రకటించారు.

- ఆర్టీసీలో ఉచిత ప్రయాణానికి పచ్చజెండా
- జిల్లాలో 1.49 లక్షల మంది దివ్యాంగులు
- ప్రస్తుతం 1,116 మందికి 50 శాతం రాయితీ.. జీవో వస్తే పూర్తిసంఖ్యపై స్పష్టత

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం వరమిచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాన్ని ఇకపై ఉచితంగా కొనసాగించవచ్చు. ప్రస్తుతం జిల్లాలో దివ్యాంగులకు ఆర్టీసీ నాలుగు రకాల పాస్‌లను జారీ చేస్తోంది. 40 శాతం శారీరక వైకల్యం, 100 శాతం వినికిడి లోపం, 100 శాతం అంధత్వం, 69 శాతం కంటే తక్కువ ఐక్యూతో మానసిక వైకల్యం ఉంటే వారికి ఆర్టీసీ పాస్‌లను జారీ చేస్తోంది.

ఉత్తర్వులు రావాలి

దివ్యాంగులకు ఉచితంగా ఆర్టీసీ ప్రయాణాలను ప్రభుత్వం కల్పించినట్టు వార్తల్లో చూశాం. అధికారికంగా మాకు జీవో రావాల్సి ఉంటుంది. ఎప్పటి నుంచి అమలు చేస్తారన్నది తెలియదు. మార్గదర్శకాల ప్రకారం తాము ఏర్పాట్లు చేస్తాం.

- డీపీటీవో షేక్ షబ్నం

జిల్లాలో 1.49 లక్షల మంది దివ్యాంగులు

జిల్లాలో వికలాంగుల సంక్షేమశాఖ లెక్కల ప్రకారం దివ్యాంగులు 1.49 లక్షల మంది ఉన్నారు. ఇందులో వికలాంగత్వం శాతాలున్న వారికే ఉచిత బస్సు ప్రయాణాలు వర్తిస్తాయి. మహిళల పరంగా దివ్యాంగులు ఉచితంగా అందుకుంటున్నారు. వీరి సంఖ్య కూడా తెలియని పరిస్థితి ఉంది. జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ జారీచేసిన విధంగా చూస్తే ప్రస్తుతం 1116 మంది 50 శాతం రాయితీ పొందుతున్నారు. వీరు కాకుండా వికలాంగత్వం ఉన్నవారికి ఏ విధంగా ఆర్టీసీ రాయితీ వర్తింపచేస్తారన్నది జీవో రూపంలో మార్గదర్శకాలు జారీ కావాల్సి ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

ఎంతో మేలు చేకూరుతుంది..



మాలాంటి దివ్యాంగుల కోసం కూటమి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సుల్లో ఉన్న 50 శాతం రాయితీని నూరుశాతం అమలు చేయాలని నిర్ణయించడం సంతోషదాయకం. ఇకపై దివ్యాంగులు బస్సుల్లో ఉచితంగా ప్రయాణిం చేందుకు అవకాశం కల్పించడం శుభపరిణామం. దివ్యాంగులపై ఛార్జీలు భారం తొలగించాలని చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం ఎంతో మేలు చేకూరుతుంది. పేద విద్యార్థులు, వృద్ధులకు మరింత ఉపయోగకరం. త్వరితగతిన అమలు చేస్తారని భావిస్తున్నాం.

- నక్కపాము రాంబాబు , ఏలూరు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ మాధవి

దళారులను ఆశ్రయించొద్దు

- రిజిస్ట్రేషన్ల సమస్యలపై చైతన్యానికి చర్యలు
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ మాధవి

ఏలూరు,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : 'రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలు, రైతులకు ఎదురవుతున్న సమస్యలపై చైతన్యం తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.. కార్డు 2.0 విధానం వల్ల పూర్తిస్థాయిలో సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రావడంతో ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా సేవలందిస్తున్నాం' అంటూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ ఎన్. మాధవి తెలిపారు. ఏలూరులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కక్షిదారుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. స్టాంప్స్ కార్యాలయ సిబ్బంది, ఆడిటింగ్ సిబ్బందితో సమీక్షించారు. మెరుగైన సేవలందించడానికి పలు సూచనలు చేశారు. కార్యాలయంలో స్టాంపులు, రికార్డులన్నింటిని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ 'ఈ సీజన్‌లో ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో వెయ్యి వరకు రిజిస్ట్రేషన్లు తగ్గాయి. ఇప్పటి వరకు ఆదాయం లక్ష్య సాధనలో 66 శాతం ఈ కార్యాలయం సాధించింది. జిల్లాలో 77 శాతం టార్గెట్‌ను సాధించాం' అని తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' అడిగిన పలు అంశాలపై ఆమె వివరిస్తూ ఆటోమ్యుటేషన్ అమలు చేయడంతో రిజిస్ట్రేషన్లు వేగవంతం అవుతున్నాయని, దళారుల నియంత్రణపై స్పందిస్తూ వారిని ఆశ్రయించొద్దనే తాము చైతన్యం కల్పిస్తున్నామన్నారు. ల్యాండ్ కన్వర్షన్ జరిగిన వివరాలను తమ కార్యాలయానికి ఇవ్వాలని ఆర్డీవోలను, డీటీసీపీవోలను కోరుతున్నట్టు తెలిపారు. తద్వారా ఇతర భూముల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయడానికి వీలుంటుందని మాధవి అన్నారు. జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మరొకరికి స్క్రబ్ టైఫస్!

- నూజివీడు నుంచి విజయవాడ జీజీహెచ్‌కు తరలింపు
- మూలాలు విశ్లేషించేందుకు ఆర్ఆర్‌టీ ఏర్పాటు

లోపలి పేజీలో..

లైన్ క్లియర్

- ఏలూరులో పారిశ్రామికవాడ ఏర్పాటు
- గతనెలలో శంకుస్థాపన, శిలాఫలకం ఆవిష్కరణ.. 2.2 ఎకరాల గుర్తింపు.. త్వరలో పనులు ప్రారంభం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

చాన్నాళ్ల తర్వాత ఏలూరు నగరంలో పారిశ్రామికవాడ ఏర్పాటు కానుంది. హేలాపురి నగరంలోని అల్లూరి సీతారామరాజు స్టేడియం పరిసరాల్లో పారిశ్రామిక పార్కుకు ఏర్పాటు 2.2 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో గతనెల 11న సీఎం చంద్రబాబు ప్రకాశం జిల్లా నుంచి వర్చువల్‌గా పాల్గొనగా స్థానికంగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆధ్వర్యంలో శంకుస్థాపన, శిలాఫలకం ఆవిష్కరణ జరిగింది. అనంతరం నిధులు మంజూరు శరవేగంగా జరగడంతో త్వరలో పారిశ్రామిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోనున్నారు. ఏలూరులో ఉన్నత విద్యావంతులు చాలామంది ఉన్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పలుమార్లు సీఎం చంద్రబాబు దృష్టికి ఎమ్మెల్యే బడేటి చంటి తీసుకెళ్లారు. జూట్‌మిల్లు మూసివేతతో చాలామంది ఉద్యోగాలు కోల్పోయారని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలోనే పారిశ్రామికవాడకు ప్రభుత్వం లైన్ క్లియర్ చేసింది.

సత్రంపాడు తర్వాత రెండోది..

ఏలూరు శివారులో సత్రంపాడులో ఇప్పటికే ఇండస్ట్రియల్ ఎస్టేట్ పలు పరిశ్రమలతో వేలాది మందికి ఉపాధి కల్పిస్తోంది. తాజాగా మంజూరైన పారిశ్రామిక పార్కు రెండోది అవుతుంది. ఏపీఎంఎస్ఎంఈ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ కింద 2.2 ఎకరాల్లో రూ.14 కోట్ల వ్యయంతో పార్కును అభివృద్ధి చేయనున్నారు.

వివిధ పరిశ్రమలకు అనువైన విధంగా స్థలాల్లో మౌలిక వసతుల కల్పనకు త్వరలో చర్యలు చేపట్టనున్నారు. ఈ వారంలోనే టెండర్లు పూర్తి చేయనున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జీ తెలిపారు. రోడ్లు, డ్రెయిన్లు, మంచినీరు, ఇతర సౌకర్యాలను కల్పించి, స్థలాలను పరిశ్రమలకు అనువుగా విభజన చేస్తామన్నారు.



పారిశ్రామికవాడకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి (ఫైల్)

సహకార ఉద్యోగుల నిరసన

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

లోపలి పేజీలో..

కోటి రూపాయలకు టోకరా..!

సెలవు రోజుల్లోనూ టెన్త్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

- పాఠశాల విద్య ఎండీఎం విభాగం రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ

ఏలూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈనెల ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్న వందరోజుల కార్యాచరణను విజయవంతం చేసేందుకు మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింపజేయాలని పాఠశాల విద్య ఎండీఎం విభాగం రాష్ట్ర ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ వెంటనే ఆదివారం నుంచి ఈ ఉత్తర్వులను జిల్లాలో టెన్త్ పరీక్షలకు ప్రభుత్వ పాఠశాలల నుంచి హాజరయ్యే 12 వేల మంది బాలబాలికలకు అమలయ్యేలా జిల్లావిద్యాశాఖ హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేసింది. మార్చి 10వ తేదీ వరకు రెండో శనివారం, ఆదివారం సెలవులతో సహా, సాధారణ సెలవురోజుల్లోనూ 100 రోజుల కార్యాచరణను అమలు చేస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలో సెలవు రోజుల్లో సైతం నిర్వహించే ప్రత్యేక తరగతులకు విద్యార్థుల హాజరు పూర్తిస్థాయిలో ఉండాలంటే మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింపజేయాలని భావించిన ప్రభుత్వం ఆ మేరకు నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలకు సుమారు 12 వేల మంది బాలబాలికలు హాజరవుతున్నారు.





హోంగార్డ్సు గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఐజీ జీవీజీ అశోక్‌కుమార్

మంచి నడవడికతో.. విధులు నిర్వర్తించాలి

- ఐజీ జీవీజీ అశోక్‌కుమార్
- ఘనంగా హోంగార్డ్సు ఆవిర్భావ దినోత్సవం

ఏలూరు క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హోంగార్డులు మంచి నడవడికతో ఉద్యోగ నిర్వహణ చేయాలని తద్వారా ప్రజలలో పోలీస్‌శాఖ పట్ల గౌరవం పెరుగుతుందని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీ) జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. 63వ హోంగార్డ్సు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఐజీ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. హోంగార్డ్సు గౌరవ వందనాన్ని స్వీకరించి పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డ్సు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, డ్రైవర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా శాంతి భద్రతల పరిరక్షణలోనూ నేరాలను అరికట్టడంలో వారు పోలీసులకు వెన్నుదన్నుగా నిలిచి సేవలు అందిస్తున్నారంటూ ప్రశంసించారు. రేంజ్ పరిధిలో ఉన్న హోంగార్డు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విశాఖపట్టణం రీజనల్ హోంగార్డ్సు కమాండర్ ఎ.జోషి మాట్లాడుతూ దేశ విపత్కర పరిస్థితుల్లో హోంగార్డులు అందించే సేవలు ఎంతో ప్రశంసనీయమన్నారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది నలుగురు హోంగార్డ్సు అనారోగ్యంతో మరణించారని పదిమంది ఉద్యోగ విరమణ చేశారన్నారు. హోంగార్డులు నెలకు ఒక్క రోజు తమ జీతాన్ని వెల్ఫేర్ ఫండ్‌కు అందిస్తున్నారని, ఆ నిధులను మరణించిన హోంగార్డుల కుటుంబాలకు, ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డులకు అందిస్తున్నట్టు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుస్మిత మాట్లాడుతూ హోంగార్డు సేవలు పోలీస్‌శాఖకు ఎంతో సహాయకారిగా ఉంటున్నారన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ జి.మునిరాజా, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు. మహిళా హోంగార్డులు కవాత్ నిర్వహించడంలో ఉత్తమంగా ఎంపిక కావడంతో వారికి ట్రోఫీని అందజేశారు. వివిధ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందించారు. హోంగార్డుగా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన వై.అప్పారావు సతీమణి ధనలక్ష్మికి హోంగార్డు వెల్ఫేర్ ఫండ్ నుంచి వచ్చిన 5 లక్షల 16 వేల 170 రూపాయల చెక్కును ఐజీ అందజేశారు.

యాదవులకు జగన్ క్షమాపణ చెప్పాలి

ఏలూరులో జగన్ ఫ్లెక్సీ దహనం

లోపలి పేజీలో..



అన్ని రంగాల్లో ప్రతిభను చాటాలి: కలెక్టర్

జిల్లాస్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడలు ప్రారంభం

భీమవరం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ధైర్యంగా ముందుకు నడవాలని, సాధారణ వ్యక్తులకు తీసిపోని విధంగా అన్ని రంగాలలో మీ ప్రతిభను చాటాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో శనివారం భీమవరం డీఎన్ఆర్ కళాశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దివ్యాంగులు ఏ రంగంలోనూ తక్కువ కాదనేది ఇప్పటికే చాలా సందర్భాల్లో రుజువైందన్నారు. దివ్యాంగులు ఆ త్మస్థైర్యంతో ముందుకు నడవాలని, మంచి భవిష్యత్‌ను పొందాలని సూచించారు. అనంతరం జిల్లాస్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, బి.రామ్ కుమార్, డిఎస్డిఓ ఎన్. మోహన దాసు పాల్గొన్నారు

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో కీర్తన ప్రతిభ



గెల్చుకున్న కాంస్య పతకం చూపుతున్న కీర్తన

ఏలూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఆర్‌డీజీకే మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని సీహెచ్ కీర్తన ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ అండర్ 17 విభాగంలో కాంస్య పతకం సాధించిందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.కాంతి జయకుమార్ తెలిపారు. ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈటానగర్‌లో జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కాంస్య పతకం సాధించిందన్నారు. అలాగే ఇటీవల గుంటూరు జిల్లా రవీంద్రపాడులో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్ట్రాంగ్ ఉమెన్ అవార్డు సొంతం చేసుకుందని కొనియాడారు. పాఠశాలలో జరి గిన అభినందన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అబ్బదాసరి జోజి బాబు, తోట శ్రీనివాస్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన ఎరువుల సీజ్



గొల్లగూడెంలో ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న అధికారులు

నిడమర్రు డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా నిల్వచేసిన ఎరువుల స్టాక్‌ను సీజ్ చేసినట్లు కే.ఆర్.పురం ఏడీ పి.జి.బుజ్జి బాబు తెలిపారు. ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ఎరువుల షాపులో ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్, రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. ఈ పరిశీలనలో సరైన పత్రాలు, అనుమతులు లేకుండా అమ్మకం చేస్తున్నందున రూ.9,66,875 విలువ గల ఎరువులపై అమ్మకం నిలుపుదల నోటీసు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌కు తరలించిన రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుంటున్న సివిల్‌సప్లై అధికారులు

ద్వారకాతిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ద్వారకాతిరుమల శివారు వేపలమ్మ ఆలయం వద్ద శనివారం పోలీసులు పట్టుకున్నారు. కామవరపుకోట మండలం ఆడమిల్లి నుంచి నల్లజర్ల మండలం దూబచర్లకు మూడు టన్నుల రేషన్ బియ్యంతో టాటావాహనం వెళ్తోంది. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి వాహన తనిఖీలు చేస్తున్న ద్వారకాతిరుమల పోలీసులకు ఈ వాహనం పట్టుబడింది. వెంటనే పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సీజ్ చేసిన బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అందజేశారు.



తాడేపల్లిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

తాడేపల్లిగూడెం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటాలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ పిలుపు నిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా 47వ మహాసభలు పట్టణంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు జిల్లా అధ్యక్షుడు బి.గణేశ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలను ఎస్ఎఫ్ఐ చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థుల సమస్యలు పరిష్కరించలేదని ఆరోపించారు. తాడేపల్లిగూడెంలో ఉన్న నన్నయ్య యూనివర్సిటీ క్యాంపస్‌లో నామమాత్రపు పీజీ కోర్సులు మాత్రమే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పేరుతో దారాదత్తం చేస్తున్నారని, సామాన్యునికి అందని ద్రాక్షగా మెడికల్ విద్యను తీసుకొస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో అత్యవసరంగా నాలుగు రైళ్లను ప్రవేశపెడుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వేశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రైలు నంబరు 07181 చర్లపల్లిలో ఈ నెల 7వ తేదీ రాత్రి 9.30 గంటలకు బయలుదేరి 8వ తేదీ రాత్రి 11.50 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. రైల్ నెంబర్ 07182 ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం 12.10 గంటలకు బయలుదేరి 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు చెర్లపల్లికి చేరుకుంటుంది.

నన్నయలో 8 నుంచి పీజీ స్పాట్ అడ్మిషన్లు

దివాన్‌చెరువు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మూడు క్యాంపస్‌లలో పీజీ కోర్సులకు ఈ నెల 8నుంచి 12 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను విశ్వవిద్యాలయంలో శనివారం ఆమె తెలియజేస్తూ నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో పీజీ కోర్సులకు రాజమహేంద్రవరంలో క్యాంపస్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని చెప్పారు. ఎంఏ, ఎంకామ్, ఎంపీఈడీ, ఎంఎస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏపీ పీజీసెట్‌లో అర్హత సాధించలేని వారు, సెట్‌కు హాజరు కాని అభ్యర్థులు కూడా పీజీ స్పాట్ అడ్మిషన్‌లలో ప్రవేశం పొందవచ్చన్నారు. సైన్స్ కోర్సులకు 8,9 తేదీల్లోను, ఆర్ట్స్ కోర్సులకు 10,11 తేదీల్లోను, ఏమైనా సందేహాలు, పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లు కోసం 12న స్పాట్ అడ్మిషన్‌లు జరుగుతాయని తెలిపారు. నన్నయ రాజమహేంద్రవరం క్యాంపస్‌లో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఎన్.సజనారాజ్ పర్యవేక్షిస్తారన్నారు. ఏపీ పీజీసెట్ 2025లో అర్హత సాధించిన అభ్యర్థులు రూ.500, పీజీ సెట్ అర్హత లేనివారు, పీజీ సెట్‌కు హాజరు కాని వారు రూ.800 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని వీసీ సూచించారు.

మళ్లీ పసిడి.. వెండి పరుగులు

» బంగారం గ్రాము బిస్కెట్ ధర రూ.13,200.. కేజీ వెండి రూ.1.83 లక్షలు



పండుగల సీజన్‌లోనూ షాపుల్లో సందడి నిల్
రానున్న రోజుల్లో మరింత పెంపు!

నరసాపురం/తాడేపల్లిగూడెం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తగ్గినట్లే తగ్గి.. మళ్లీ పసిడి, వెండి ధరలు పరుగులు తీస్తున్నా యి. గురువారం కేజీ వెండి బులియన్ మార్కెట్‌లో రూ.1.83లక్షలు పలికింది. ఇక పసిడి గ్రాము బిస్కెట్ రూ. 13,200 ఉండగా.. ఆర్నమెంట్ బంగారం రూ.12,200కి చేరింది. గత నెలలో ధరలు ఒక్కసారిగా దిగాయి. కేజీ వెండి రూ.1.40 లక్షలకు దిగింది. దీంతో ఇంకా పడిపోతుందన్న భయంతో చాలామంది ఆయినకాడికి అమ్ముకున్నారు. పసిడిలోనూ ఇదే పరిస్థితి. బిస్కెట్ బంగారం గ్రాము రూ.12,100కి పడింది. ఆర్నమెంట్ గ్రాము రూ.11,200 దిగి వచ్చింది. ఈ పరిణామాలు గమనించిన వినియోగ దారులు రానున్న రోజుల్లో వీటి ధరలు మరింత తగ్గుతాయని ఎదురు చూశారు. కానీ అంతర్జాతీయంగా నెలకొన్న పరిణామాల నేపథ్యంలో మళ్లీ క్రమంగా పెరుగుతూ వచ్చాయి. డాలర్ పతనం, క్రూడ్ ఆయిల్, స్టాక్‌మార్కెట్ పతనాలు, అమెరికాలో కొనసాగుతున్న షట్‌డౌన్, ఇంకా తొలగని రష్యా, ఉక్రెయిన్ల సమస్యలు పసిడి పెరుగుదలకు కారణంగా చెబుతున్నారు. డబ్బువిలువ తగ్గడంతో పెట్టుబడిదారులు బంగారంలో పెట్టుబడిపెట్టి పొదుపును కాపాడు కుంటున్నారు. భారత్, చైనా, రష్యా వంటి దేశాలు తమ నిల్వల్లో బంగారాన్ని పెంచుకుంటున్నాయి. వీటికి తోడు చాలాదేశాల బ్యాంకులు బంగారు నిల్వలు పెంచుకోవడం పెరు గుదలకు కారణంగా చెబుతున్నారు. ఇదే ట్రెండ్ కొనసాగితే రాను న్న రోజుల్లో వీటి ధరలు మరింత పెరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రభావం జిల్లా బులియన్ మార్కెట్‌పై పడింది. ప్రస్తుతం పండుగల సీజన్ కావడంతో మంచి డిమాండ్ ఉంటుందని వ్యాపా రులు అంచనా వేసి దానికి అనుగుణంగా స్టాక్‌ను పెట్టారు. కానీ ధర పెరుగుదలతో వినియోగదారులు ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. ఈ కారణంగా నిత్యం రద్దీగా ఉండే నరసాపురం, భీమవరం బులియన్ మార్కెట్‌లో సందడి కనిపించడం లేదు.

బంగారంలో పెట్టుబడికి కొన్ని మార్గాలు

బంగారంలో పెట్టుబడి పెట్టడానికి భౌతిక బంగారం, గోల్డ్ ఈటీఎఫ్, డిజిటల్ గోల్డ్, సావరిన్ గోల్డ్ బాండ్లు వంటి మార్గాలు ఉన్నాయి. భౌతిక బంగారం అంటే నాణేలు, బార్లు లేదా ఆభరణాలను బ్యాంకులు, జ్యూవెలర్ల వద్ద కొనడం వంటివి. శుద్ధ బంగారం కొనాలి అనే వారికి నాణేలు, బారులు ఉత్తమమైన ఎంపిక. గోల్డ్ ఈటీఎఫ్‌లు బంగారాన్ని ప్రత్యక్షంగా కాకుండా స్టాక్ ఎక్చేంజ్ ద్వారా పెట్టుబడి పెట్టాలనుకునే వారికి గోల్డ్ ఈటీఎఫ్ అనువైన మార్గంగా నిలుస్తు ంది.

గోల్డ్‌ను ఈటీఎఫ్‌లో ఎలా కొనాలి?

గోల్డ్ ఈటీఎఫ్స్‌లో కొనడానికి ముందుగా డీమ్యాట్, ట్రేడింగ్ అకౌంట్ తెరవాల్సి ఉంటుంది. తరువాత స్టాక్ ఎక్చేంజ్‌లో లాగిన్ చేసి కొనుగోలు ఆర్డర్ ఇవ్వాలి.

డిజిటల్ గోల్డ్..

పెట్టుబడికి డిజిటల్ గోల్డ్ ఉత్తమ మార్గం. కేవలం రూ.10 నుంచి ఇందులో బంగారాన్ని కొనుగోలు చేయవచ్చు. దొంగతనం భయం ఉండదు. తయారీ ఖర్చులు అసలే ఉండవు. అయితే జీఎస్టీ మాత్రం ఉంటుంది. కొనే రేటు కంటే అమ్మే రేటు తక్కువగా ఉంటుందనేది మదుపరులు మరిచిపోవద్దు.

సావరిన్ గోల్డ్ బాండ్స్

భౌతిక బంగారం కాకుండా ప్రభుత్వ హామీతో బంగారంపై పెట్టుబడి పెట్టే పద్ధతే సావరిన్ గోల్డ్ బాండ్ విధానం. ఇవి రిజర్వ్ బ్యాంక్ ద్వారా జారీ అవుతాయి. వీటిపై ప్రతి ఏటా 2.5 శాతం వడ్డీతో బంగారం ధర పెరిగితే అదనపు లాభం కూడా ఇస్తారు. గడువు వరకు ఉంచితే పన్ను లాభాలు ఉంటాయి. ప్రస్తుతం కొత్త ఇష్యూ అందుబాటులో లేకపోయినా సెకండరీ మార్కెట్లో కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.

కూటమి ప్రభుత్వంలో రైతులకు మేలు



ఆవుదూడను నిమురుతున్న మంత్రి

యలమంచిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల మేలుకోసం చిత్తశుద్ధితో పనిచేసేది ఎన్డీఏ కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మట్లపాలెంలో శనివారం నిర్వహించిన పశువుల దాణా పంపిణీ, లేగ పెయ్యిదూడల అందాల పోటీలు, పశువైద్యశిబిరం కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. 50శాతం రాయితీపై పశువుల దాణాను మంత్రి రామానాయుడు 200 మంది పాడిరైతులకు అంద జేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాడి,పంటలు బాగుంటేనే రైతు బాగుంటాడనే సదుద్దేశంతో వారికి అనేక ప్రోత్సా హకాలను, పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో పాడిరైతులకు 50శాతం రాయితీపై 110 టన్నుల పశువుల దాణాను 1750మంది రైతులకు అందించామన్నారు. 50కేజీల బస్తా విలువ రూ.1110 కాగా రాయితీపై రైతుకు రూ.555కే అందిస్తున్నామని, నియోజకవర్గం మొత్తం మీద రైతులకు 12లక్షల 21వేలు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, డేగల సత్యనారాయణ, అడబాల చిట్టిబాబు, ఆరుమిల్లి రామశ్రీనివాస్, బోనం చినబాబు, పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

మేధావి క్రీడ చెస్: కృష్ణ తేజ



కృష్ణ తేజను అభినందిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల

పాలకొల్లు టౌన్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మేధావి క్రీడ చదరంగం (చెస్) ద్వారా విద్యార్థులకు మేథాశక్తి పెంపొందుతుందని ఇంటర్నేషనల్ చెస్ క్రీడాకారుడు కృష్ణ తేజ అన్నారు. స్థానిక యూరో కిడ్స్‌స్కూల్లో శనివారం 55 మంది విద్యార్థులతో ఒకే సారి చెస్ ఆడి తనప్రతిభను చాటుకున్నారు. చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రం, షీల్డులను మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అందజేశారు. కృష్ణ తేజను మంత్రి నిమ్మల రామానాయుడు అభినందించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో గుమ్మళ్ళ వీరాస్వామి, జిల్లా చెస్ అధ్యక్షుడు మాదాసు కిషోర్, యూరో కిడ్స్ డైరెక్టర్ ఎంఆర్ఆర్ రాజేష్, ప్రిన్సిపాల్ వి.ప్రతిమ, కృష్ణతేజ తండ్రి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా క్రాస్ కంట్రీ జట్ల ఎంపిక పోటీలు

తణుకు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):ఈనెల 8వ తేదీన జిల్లా క్రాస్ కంట్రీ (రోడ్ రన్) జట్ల ఎంపిక పోటీలు తణుకులో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. సోమవా రం ఉదయం 6 గంటలకు తణుకు డీమార్ట్ వద్ద ఈపోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈపోటీలు అండర్ 16, 18, 20 విభాగాలలో బాలికలు, బాలుర విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈపోటీలలో ఎంపికైన వారు డిసెం బరు 24న తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అ ధ్యక్షుడు చింతకాయల సత్యనారాయణ 98853 91602, కార్యదర్శి సంకు సూర్యనారాయణ 99893 63978, కోశాధికారి కటికితల బాబూరావు 96762 51733 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.



శ్రీవారికి సహస్ర దీపార్చన

భీమవరం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామివారికి, అమ్మవారికి సహస్రదీపాలంకరణ నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి ఆదినారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి, అమ్మవారికి తులసీ దళాలతో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకారం చేసిన ఊయ్యాలలో ఉంచి సహ స్రదీపాలను వెలిగించి హారతులను ఇచ్చారు. దీపాల వెలుగులో దర్శించుకున్నారు.



శ్రీవారి దర్శనానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న యాత్రికులు

గోవింద నామాలతో పులకించిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి సన్నిధి గోవిందనామాలతో మారుమ్రోగింది. విదియ మంచి తిది కావడం, శనివారం అవడం వల్ల ఆలయం భక్తుల రాకతో కళకళలాడింది. ఆలయానికి దాదాపు 20వేల మంది వరకు భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. ఆలయానికి వచ్చిన పలువురు యాత్రికులు ముందుగా కేశఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానంతరం వారంతా స్వామి వారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీవారి సాధారణ దర్శనానికి 2 గంటల పైబడి సమయం పట్టింది.





జడ్జి వాసంతి, ఇన్ఫర్మేషన్ కమిషనర్ సునీల్‌కు స్వామి వారి చిత్రపటాలు అందిస్తున్న ఆలయ అధికారులు

శివయ్యకు ప్రత్యేక పూజలు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామిని శనివారం అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎ.వాసంతి, ఇన్ఫర్మేషన్ కమిషనర్ చావలి సునీల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారికి అధికారులు, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. వారికి ఆలయ పండితులు వేదాశీర్వచనంగావించి స్వామివారి శేష వస్త్రాన్ని, చిత్రపటాన్ని అందజేశారు. ఈకార్యక్రమాల్లో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్, తహసీల్దార్ వై.దుర్గా కిషోర్, ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సినీ హాస్యనటుడు, పాస్టర్ జోసఫ్ మృతి



సినీ నటుడు జోసఫ్ (ఫైల్)

నిడమర్రు డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెదనింద్రకొలను గ్రామానికి చెందిన పాస్టర్, సినీ హాస్యనటుడు మరిపూడి జోసఫ్ (47) గుండెపోటుతో గురువారం రాత్రి మరణించారు. చిలుకలూరిపేటకు క్రైస్తవ కూటమి కార్యక్రమాలుకు ఉపన్యాసకులుగా వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో గుండెపోటుకు గురై తుది శ్వాస విడిచారు. తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత 25 సంవత్సరాలు క్రితం ఉంగుటూరు మండలం చేబ్రోలులో పాస్టర్ యోబు వద్దకు చేరి ఆయన వద్ద శిష్యరికం చేస్తూ ఉపన్యాసకులుగా మంచి పేరు సంపాదించారు. క్రైస్తవ ఉపన్యాసాలకు హాస్యం జోడిస్తూ ఏసుక్రీస్తు వాక్యం చెప్పడంలో ఆయన అందవేసిన చెయ్యి. ఆయన పొట్టిగా ఉండడంతో గతంలో పాతాళభైరవితో పాటు ఆరు సినిమాలలో నటించి ప్రేక్షకులను అలరించారు. చనిపోయిన జోసఫ్ కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కాలనీల్లో సదుపాయాల కొరత



దేవ జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారి

ప్రోబ్లమ్స్ జోన్

పెనుగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పలు గ్రామాల్లో ఎన్‌టీఆర్, వైఎస్ఆర్, ఇందిరమ్మ, జగనన్న కాలనీలు ఏర్పాడ్డాయి. చాలా కాలనీల్లో మౌలిక వసతులు కల్పన చేయక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు సమకూ ర్చి ఇళ్ల నిర్మాణ సముదాయం కోసం ఇప్ప టి వరకు సుమారు 39 కాలనీలు ఏ ర్పాటు చేశారు. ఈ కాలనీల్లో లబ్ధిదారు లు ఇళ్ల నిర్మాణాలు చేపట్టి చాలా మంది నివాసం ఉంటున్నా రు. వీటిలోని పలు కాలనీలు రహదారులు, మురుగు డ్రెయిన్‌లు నిర్మించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దేవ జగనన్న కాలనీలో ఏళ్లు గడుస్తున్నా నేటికి మౌలిక వసతులు కానరావడం లే దు. లబ్దిదారులకు ఏర్పాటు చేసిన కాలనీల్లో రహదారులు, డ్రెయిన్ వ్యవస్థ కల్పన ఊసే మర్చిపోయారు. మురుగు నీరు పారే దారి లేక ఇళ్ల వద్దే నీరు నిలిచి పోతుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ములపర్రు శివారు సీతారాముని చెరువులో ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పడిన కాలనీల్లో ము రుగు డ్రెయిన్ నిర్మించకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.



ములపర్రు శివారు సీతారాముని చెరువు లో డ్రెయిన్ లేక నిలిచిన మురుగు



రెయిలింగ్ విరిగిపోయి శిథిలావస్థలో ఉన్న వంతెన

అదుపు తప్పితే కాలువలోకే..

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాడీ పేట- నాగరాజు పేటలను కలుపుతూ నరసాపురం ప్రధాన పంట కాలువపై 1998లో నిర్మించిన కాలి బాట వంతెన శిథిలావస్థకు చేరుకున్నది. ఈవంతెన మీదుగా గొల్లవాని చెరువు, కాపవరం, వాలమర్రు, తదితర గ్రామాలకు దగ్గర దారి కావడంతో నిత్యం వందలాదిగా ద్విచక్రవాహనాలు, పాదచారులు ప్రయాణాలు చేస్తూ ంటారు. వంతెనకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ పూర్తిగా దెబ్బతింది. దీనితో వాహనదారులు ఏ మాత్రం అదుపు తప్పినా కాలువలోకి పడిపోయే ప్రమాదనం ఉన్నది. బ్రాడీపేట వైపు పాలకొల్లు మార్టేరు రోడ్డుపైకి, నాగరాజుపేట వైపు వడ్లవానిపాలెం అర్‌అండ్‌బి రోడ్డుపై పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. ప్రయాణీకులు మాత్రం తప్పని పరిస్థితుల్లో ప్రమాదం అని తెలిసినా వాహనాలపై తిరుగుతూనే ఉన్నారు. సేవా సంస్థల ప్రతినిధులు గతంలో కొంత మరమ్మతులు చేప్పటినప్పటికీ వంతెన రైలింగ్ మరలా పాడైపోయింది. పాలకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

ముందుకు సాగని ఆరోగ్య కేంద్రాల నిర్మాణం

జిల్లాలో నాలుగు కేంద్రాలపై నీలినీడలు



కాళీపట్నం పడమరలో ఆసుపత్రి నిర్మాణానికి గుర్తించిన స్థలం

మొగల్తూరు. డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి సర్కార్ వైద్యం అందించాలనే తలంపుతో గత వైసీపీ పాలనలో చేపట్టిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగలేదు. జిల్లాలో కాళ్ళ మండలం కలవపూడి, మొగల్తూరు మండలం కాళీపట్నం, పోడూరు మం డలం గుమ్ములూరు, పాలకోడేరు మండలం పెన్నాడ గ్రామాల్లో ప్రాథమిక ఆసుపత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు అనుగుణంగా అక్టోబరు 18, 2002న నాటి వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎంటి కృష్ణబాబు ఒక్కొక్క ఆసుపత్రికి రూ.2.40 కోట్లు నిధులు (కేంద్ర ప్రభుత్వ నిధులు) విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఆసుపత్రుల నిర్మాణాన్ని ఆర్‌అండ్‌బి శాఖ పర్యవేక్షణలో నిర్మాణం చేపట్టేలా ఆసమయంలో వెలువడ్డ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే జిల్లాలో మంజూరైన నాలుగు మండలాల్లోనూ ఒక్క ఆసుపత్రి నిర్మాణం కూడా సాగలేదు. మొగల్తూరు మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు గానూ కెపిపాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామ పంచాయతీలు నరసాపురం మండలం తూర్పుతాళ్ళు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉండగా మిగిలిన 14 గ్రామ పంచాయతీలకు సంబంధించి మొగల్తూరు ఆరోగ్య కేంద్రం పర్యవేక్షణలో వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో వైద్య సేవలకు దూరంగా ఉన్న కాళీపట్నం రెవెన్యూ గ్రామ పరిధి కొత్తోట, కాళీపట్నం పడమర, తూర్పు, జగన్నాథపురం, పాతపాడు, కోమటితిప్ప గ్రామాల్లో వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు తలపెట్టిన కాళీపట్నం ఆసుపత్రి నిర్మాణానికి గ్రామస్థులు ముందుకు వచ్చారు. అందరికీ అనువైన ప్రాంతంలో ఉన్న సుమారు 20 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆనుకుని మరో 45 సెంట్లు ఆసుపత్రికి స్థలం ఇచ్చేందుకు గ్రామస్థులు ముందుకు రావడంతో స్థల సేకరణ చేశారు. ప్రభుత్వం మారినా, ప్రజాప్రతినిధులు మారినప్పటికీ ఆసుపత్రి నిర్మాణం నోచుకోకపోవడంతో శివారు ప్రాంత ప్రజలు ఆవేదన చెందుతున్నారు. నిర్మాణ ప్రక్రియను గతంలో ఆర్‌అండ్‌బి పర్యవేక్షణ నుంచి చేపట్టాలని ఉత్తర్వులు ఉండగా ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖ నిర్మించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్టు తెలిసింది. అయితే నిర్మాణంలో జాప్యం చోటు చేసుకోవడంతో కేంద్ర ప్రభుత్వ నిధులు వెనక్కి వెళ్ళాయి. వాటిని రప్పించాల్సి ఉన్నది. ఇక జిల్లాలో పైనాలుగు మండలాల్లోనూ స్థల సేకరణ సమస్యతో ఆసుపత్రులు నిర్మాణం సాగలేదు. కూటమి పాలనలో నైనా ఆసుపత్రుల నిర్మాణాలు పూర్తి చేసి సర్కారు వైద్యం శివారున ఉండే ప్రతి పేదవాడికి అందించేలా చర్యలు తీసుకోవాలని తీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



జగన్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న యాదవ సంఘం నాయకులు

యాదవులకు జగన్ క్షమాపణ చెప్పాలి

ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్లో జగన్ ఫ్లెక్సీ దహనం

ఏలూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాదవ, బీసీ సంఘాల నాయకులు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై భగ్గుమన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి బీసీ కులానికి చెందిన కృష్ణయ్య యాదవ్, ఐపీఎస్ అధికారి గోపీనాథ్ జెట్టిపై జగన్ అనుచిత వ్యాఖ్యలపై యాదవ యువ సమితి ఏలూరు జిల్లా అధ్యక్షుడు కాట్రు బాలకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో శనివారం జగన్ ఫ్లెక్సీని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాట్రు బాలకృష్ణ మాట్లాడుతూ నిజాయితీగల అధికారి గోపీనాథ్ జెట్టిని, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య యాదవ్‌ను వాడు.. వీడు అని సంబోధించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణం యాదవులకు జగన్ క్షమాపణ చెప్పాలని లేకుంటే ఆయనను రోడ్డుపై తిరగనివ్వమని హెచ్చరించారు. తాను చేసిన అక్రమాలు బయట పెడుతున్నారని తట్టుకోలేక జగన్ అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్ మాట్లాడుతూ జగన్‌ను ప్రజలు ఛీకొట్టి 11 సీట్లకే పరిమితం చేసినా అహంకారం తగ్గలేదని, తక్షణం బీసీలకు, యాదవులకు క్షమాపణ చెప్పకుంటే బుద్ధి చెప్తామని హెచ్చరించారు. యాదవ సంఘం నాయకులు పి. మహేష్ యాదవ్, టి. జమలయ్య, పి. శ్రీనివాస్, ఎన్ లక్ష్మణ్, మన్నే పోతురాజు, మల్లిపూడి రాజు, కొలుసు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: బీసీ అధికారులైన విశాఖ రేంజ్ డీఐజీ, సీనియర్ ఐపీఎస్ గోపీనాథ్ జట్టి, మాజీ ఐఏఎస్ కృష్ణయ్యపై మాజీ సీఎం జగన్ అనుచిత వ్యాఖ్యలను యాదవ సంఘ నేతలు ఖండించారు. స్థానిక యాదవ కల్యాణ మండప ఆవరణలో శనివారం జరిగిన సమావేశంలో జిల్లా యాదవ సంఘ కార్యదర్శి కూరాకుల బుజ్జి మాట్లాడుతూ నిజాయితీ గల యాదవ అధికారులపై చేసిన వ్యాఖ్యలను జగన్ వెంటనే వెనక్కి తీసుకుని వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. సంఘ నేతలు ములకాల రాంబాబు, పంచం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూరాకుల బుజ్జి

కోటి రూపాయలకు టోకరా..!

» డ్వాక్రా సభ్యులను బురిడీ కొట్టించిన యానిమేటర్ » బాధితులు లబోదిబో..



బ్యాంకు బయట చర్చించుకుంటున్న బాధితులు

ఆకివీడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆకివీడుకు చెందిన డ్వాక్రా రిసోర్స్ పర్సన్ (యానిమేటర్) సభ్యులను లక్షల్లో మోసం చేసినట్లు పత్రికల్లో వచ్చిన వార్తలతో లీడర్లు, సభ్యులు షాక్‌కు గురయ్యారు. దీంతో డ్వాక్రా మహిళలు తమ బ్యాంకులకు వెళ్ళి ఖాతాలకు సంబంధించి స్టేట్‌మెంట్లు తీసుకొని ఎంత మోసపోయామో తెలుసుకొని లబోదిబోమంటున్నారు.

ఆకివీడు సంతమార్కెట్‌కు చెందిన డ్వాక్రా రిసోర్స్ పర్సన్ ఎల్.సుధ తమ లీడర్లు, సభ్యులను కోటి రూపాయల మేర బురిడీ కొట్టించిందని తెలుస్తోంది. సుధకు 36 గ్రూపులున్నాయి. ఈ గ్రూపులకు సంబంధించిన నలుగురైదురు ఫొటోలు మార్చి సంతకాలు ఫోర్జరీ చేసి బ్యాంకు అధికారుల ద్వారా ఖాతాలో నగదు వేయించుకొని తరువాత వాళ్ళతో ఫోన్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకొనేదని తెలుస్తుంది. ఇలా పలు దఫాలుగా చేసి రూ. 96లక్షలు తమ సొంత ప్రయోజనాలకు వాడుకున్నట్లు సమాచారం. సుధ ఉండిలో చెప్పుల దుకాణం, స్థలం కొనుగోలు చేయడమే కాకుండా విహార యాత్రలు కూడా చేసిందని వినికిడి. సంఘం సభ్యులు రుణాలు తీసుకోకపోయినా లోన్ చెల్లించాలని బ్యాంకు నుంచి సమాచారం రావడంతో ఖంగుతిన్నారు. ఈ విషయంపై యానిమేటర్‌ను లీడర్లు, సభ్యులు నిలదీస్తే పురుగుమందు తాగి తన చావుకు మీరే కారణమని బెదిరించిందని బాధితులు తెలిపారు. దీంతో వారు ప్రజా ప్రతినిధులు దగ్గరకు వెళ్ళగా ఆమెను పిలిచి మాట్లాడగా రూ.96లక్షలు డ్రా చేసి వాడుకున్నానని, ఇప్పుడు తన దగ్గర రూ.17లక్షలు ఉన్నాయని తెలపడంతో ముందుగా ఆ నగదు బ్యాంకులో జమ చేయాలని ఆదేశించడంతో జమ చేసినట్లు సమాచారం. అంతే కాక సుధకు ఒత్తిడి పెరగడంతో ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్లు తెలుస్తోంది.



బ్యాంకులో డ్వాక్రా ఖాతాలు పరిశీలించి చర్చిస్తున్న బ్యాంకు, మెప్మా అధికారులు

మెప్మా పీడీ ఆదేశాల మేర జిల్లా అధికారులు మోహన్, నానిబాబు ఆకివీడులోని కార్యాలయానికి వచ్చి సీవో జయకృష్ణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు గ్రూప్‌ల మహిళలు వచ్చి తమ ఆవేదన వెలి బుచ్చుతున్నారని మెప్మా సీవో జయకృష్ణ తెలిపారు.

ఆకివీడు యూనియన్ బ్యాంకులో యానిమేటర్ ద్వారా లీడర్లకు, సభ్యులకు అన్యాయం జరిగిందని భీమవరం కార్యాలయానికి తెలియడంతో శనివారం తాను వచ్చానని డిప్యూటీ రీజనల్ జిల్లా అధికారి సత్యనారాయణ మీడియాకు తెలిపారు. డ్వాక్రా ఖాతాలు పరిశీలిస్తున్నామని, నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. బ్యాంకు మేనేజర్‌గా యండగండి నాగరమేష్ ఉన్నారు. ఆయనకు ముందు పనిచేసిన మేనేజర్‌ను కూడా పిలుస్తున్నట్లు సమాచారం.

ఘోరంగా మోసపోయాం



వాసవి గ్రూప్‌లో పదిహేనేళ్ళ నుంచి యానిమేటర్, తాము కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి ఉంటున్నాం. ఈ ఏడాది మార్చి నెలలో రూ.5 లక్షలు నగదు బ్యాంకు ద్వారా తమ గ్రూప్‌లో పడింది. ఈ విషయం యానిమేటర్ నవంబరు వరకు తమకు తెలియచేయలేదు. డబ్బు అవసరమని సుధను అడుగుతుంటే అదిగో ఇదిగో అంటుండడంతో అనుమానం వచ్చి బ్యాంకు వెళ్ళి స్టేట్‌మెంట్ తీసుకొంటే అసలు విషయం బయట పడింది. పది రోజుల్లో తమ నగదు జమ చేస్తానని చెప్పింది.

-కొల్లిపర లలితాకుమారి, డ్వాక్రా లీడర్, ఆకివీడు

ఫోన్ స్విచ్ఛాఫ్.. మనిషి అదృశ్యం



యానిమేటర్ సుధకు ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుంది. ఇంటికి వెళ్ళితే ఎవరూ లేరు. తనను బెదిరిస్తే పురుగుమందు తాగి తన చావుకు కారణమని పలువురితో అన్నట్లు తెలిసింది. దీంతో ఆమెపై ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నారు. తమ గ్రూప్ ద్వారా మనిషికి రూ.50 వేలుతో పాటు వడ్డీ రూ.50 వేలు అయిందని ఇప్పుడు ఈ డబ్బులు ఎవరు కడతారు. గ్రూప్‌లో కాయ కష్టం చేసుకొని బతికే వాళ్ళు చాలా మంది ఉన్నారు. ఈ నగదే కా కుండా పలు అమౌంట్లలో కూడా తేడాలున్నట్లు తెలుస్తుంది.

-మొవ్వా సుధారాణి, సభ్యురాలు, ఆకివీడు



కొమ్ముగూడెం వద్ద సొసైటీ ఉద్యోగుల నిరసన

సహకార ఉద్యోగుల నిరసన

ఏలూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తమ అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సొసైటీల్లో పనిచేసే ఉద్యోగులు జిల్లా వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 258 సొసైటీల్లో 1400 మంది ఉద్యోగులు, సిబ్బంది ఆందోళనకు ఉపక్రమించారు. నెలరోజుల పాటు దశలవారీగా ఆందోళనలకు పిలుపునిచ్చిన ఉద్యోగులు తమ విధులకు హాజరవుతూనే నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. విధులకు ఏ మాత్రం ఆటంకం కలిగించకుండా అన్నిచోట్ల ఆందోళనల్లో సిబ్బంది పాల్గొన్నారు.

జడ్జి పర్వేజ్‌కు పీహెచ్‌డీ



న్యాయమూర్తి పర్వేజ్‌కు పీహెచ్‌డీ అందిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కోర్టు ఆవరణ లోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి ఎస్‌కె ఎండీ అబూ తాలీబ్ పర్వేజ్‌కు పీహెచ్ డీని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం శనివారం ప్రదానం చేశారు. ఆచార్య నాగార్జున వర్సిటీలో న్యాయ శాస్త్రంలో పర్వేజ్ పీహెచ్‌డీ చేశారు. వర్శిటీ పరిశోధనా పర్యవేక్షకులు డాక్టర్ ఎ. గురవయ్య పర్యవేక్షణలో పారా లీగల్ వలంటీర్లు, న్యాయ విద్యార్థులు గ్రామీణ ప్రజలకు చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించడంలో ఎదురవుతున్న క్లిష్టమైన అంశాలపై విశ్లేషణను గుంటూ రు జిల్లాపై పరిశోధన చేసినట్టు ఆ పరిశోధన విభాగం సమన్వయకర్త డాక్టర్ పి. సుధాకర్ తెలిపారు. ఆచార్య నాగార్జున వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఈ మేరకు పీహెచ్‌డీని జడ్జి పర్వేజ్‌కు అందించి అభినందించారు.

డాక్టర్ శ్రీనివాసరాజుకు ఐఎంఏ పురస్కారం



ఏలూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ పురస్కారం-2025కి ఏలూరుకు చెందిన వైద్య నిపుణుడు డాక్టర్ సీహెచ్. శ్రీనివాసరాజు ఎంపికయ్యారు. వివరాలను ఐఎంఏ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు శనివారం స్థానిక మీడియాకు తెలియజేశారు. వైద్యవృత్తిలో అత్యుత్తమ సేవలందించేవారికి ఐఎంఏ జాతీయస్థాయిలో ఏటా డాక్టర్ జ్యోతి ప్రసాద్ గంగూలీ స్మారక జాతీయ పురస్కారం అందజేస్తుందని, ఈ పురస్కారానికి ఈ ఏడాది డాక్టర్ శ్రీనివాసరాజును ఎంపిక చేస్తూ ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సర్బరిదత్తా శనివారం ప్రకటించారని వివరించారు. ఈ పురస్కారాన్ని అహ్మదాబాద్(గుజరాత్)లో ఈ నెల 27న నిర్వహించనున్న ఐఎంఏ నాట్కాన్, 86వ కేంద్ర మండలి వార్షిక సమావేశంలో డాక్టర్ శ్రీనివాస రాజుకు అందజేస్తారని తెలిపారు. ఈ పురస్కారానికి రాష్ట్రం నుంచి ఎంపికైన తొలి వైద్యుడిగా శ్రీనివాసరాజు గుర్తింపు పొందారన్నారు. అవార్డుకు ఎంపికైన ఆయనను ఐఎంఏ నాయకులు డాక్టర్ బసవరాజు, విజయ భాస్కరరెడ్డి, ప్రసాదరావు, ప్రసన్నకుమార్, సుబ్బారావు తదితరులు అభినందించారు.



అమ్మపాలెంలో బాధితురాలి ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న ర్యాపిడ్ రెస్పాన్సిబిలిటీ టీం ప్రతినిధులు

మరొకరికి స్క్రబ్ టైఫస్!

» నూజివీడు నుంచి విజయవాడ జీజీహెచ్‌కు తరలింపు

» మూలాలు విశ్లేషించేందుకు ఆర్‌ఆర్‌టీల ఏర్పాటు

ఏలూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసు మరొకటి నమోదైంది. తాజాగా నమోదైన కేసుతో జిల్లాలో ముగ్గురు బాధితులు స్క్రబ్ టైఫస్ బారినపడినట్టు అధికారికంగా రుజువైంది. నూజివీడుకు చెందిన ఓ వ్యక్తి(35) తాపీ పనుల నిమిత్తం రోజూ ఏలూరు రాకపోకలు సాగిస్తుంటాడు. తీవ్ర జ్వరం, మలబద్ధకం సమస్యతో గత నెల 29న నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చేరాడు. ఇతనికి కిడ్నీలో రాళ్ల సమస్య కూడా ఉంది. చికిత్స అందిస్తున్నప్పటికీ జ్వరం అదుపులోకి రాకపోవడంతో శుక్రవారం రాత్రి ఎలీసా టెస్టు నిర్వహించగా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ నిర్ధారణైంది. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం అతనిని శనివారం ఉదయం విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యస్థితి నిలకడగానే ఉందని, ఆందోళన చెందనక్కర్లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. బాధితుని ఇంటి ఆవరణలోనే పశువుల షెడ్డు మురుగుతో ఉండటంతో నల్లిపురుగు వ్యాప్తిచెంది ఉండవచ్చునని ప్రాథమికంగా ఓ అంచనాకు వైద్యవర్గాలు వచ్చినట్టు సమాచారం. ఇప్పటికే టి.నరసాపురానికి చెందిన ఓ పురుషునికి, పెదవేగి మండలం అమ్మపాలెంకు చెందిన ఓ మహిళకు స్క్రబ్ టైఫస్ నిర్ధారణకాగా, తాజాగా మరొకరు నల్లిలాంటి ఓ రకం పురుగుకాటుకు గురయ్యారు. కాగా ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న అమ్మపాలెంకుచెందిన మహిళకు ఆరోగ్యం కుదుటపడటంతో శనివారం డిశ్చార్జి చేశారు.

జిల్లాల వారీగా ఆర్‌ఆర్‌టీ

రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో సంబంధిత రోగులు నివసించే ఇళ్లవద్దకేవెళ్లి మూలాలను అన్వేషించి, విశ్లేషించేందుకు జిల్లాల వారీగా ర్యాపిడ్ రెస్పాన్సిబిలిటీ టీం(ఆర్‌ఆర్‌టీ)లను నియమించింది. ఈ టీంలో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, జనరల్ మెడిసిన్ వైద్యుడు, పీడియాట్రిక్స్ వైద్యుడు, కమ్యూనిటీ మెడిసిన్ వైద్యనిపుణుడు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఐడీఎస్పీ (అంటువ్యాధులు/కీటకజనిత వ్యాధుల) విభాగం జిల్లా ఎపిడమాలసిస్టు ఉంటారు. ఈ బృందం శనివారం పెదవేగి మండలం అమ్మపాలెంలో స్క్రబ్ టైఫస్ బారిన పడిన మహిళ ఇంటిని సందర్శించింది. బాధితురాలి కుమార్తె నుంచి వివరాలను అడిగి తెలుసుకోవడంతోపాటు, ఇంటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఇంటి ప్రాంగణంలో చెత్తాచెదారం, పొదలతో ఉన్నట్టు గమనించారు. మంచాన్ని, ఆవరణలోని నీటితొట్టు పరీక్షించారు. నివేదికను ప్రభుత్వానికి పంపించనున్నారు. జిల్లాకు నియమించిన ఈ బృందంలో ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి, వైస్‌ప్రిన్సిపాల్/మైక్రోబయాలజీ హెచ్‌వోడి డాక్టర్ శశిధర్, ఎస్పీఎం విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ, తదితరులున్నారు.

గుండెపోటుతో భక్తుడి మృతి



మహేశ్ మృతదేహం

ద్వారకాతిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చినవెంకన్న క్షేత్రానికి వచ్చిన ఓ భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. విజయవాడకు చెందిన రెడ్డిపల్లి మహేష్(55) శనివారం ఉదయం శ్రీవారి దర్శనానికి ద్వారకాతిరుమలకు వచ్చాడు. కేశఖండనశాల వద్ద తలనీలాలు సమర్పించి, టాయిలెట్‌కని సమీపంలో ఉన్న ఖాళీ స్థలానికి వెళ్లాడు. అక్కడ గుండెపోటురావడంతో కుప్పకూలిపోయాడు. ఎవరూ ఆ ప్రాంతంలో లేకపోవడంతో ఈ ఘటనను గుర్తించలేదు. అయితే మధ్యాహ్న సమయానికి అటుగా వచ్చిన కొందరు భక్తులు ఎవరో పడిపోయి ఉన్నట్లు గమనించి సెక్యూరిటీకి సమాచారం అందించారు. వారు అంబులెన్స్‌లో స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడున్న వైద్య సిబ్బంది పరీక్షించి అతను మృతి చెందాడని చెప్పారు. దీంతో అతని వద్దఉన్న ఫోన్ నెంబరు ఆధారంగా మృతుని కుమారునికి ఫోన్ చేసి విషయం చెప్పారు. మృతుడు మహేష్ విజయవాడలో ముఠాకూలీ పనులు చేస్తుంటాడని తెలిసింది.

విద్యుదాఘాతంతో బోర్ మెకానిక్ మృతి

ద్వారకాతిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పొలంలో బోరుకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మండలంలోని లక్ష్మీపురంకాలనీకి చెందిన పెచ్చెట్టి పెద్దిరాజు (40) బోరు మెకానిక్‌గా జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఉదయం రైతు రామ్మోహన్‌రావు వ్యవసాయక్షేత్రంలో బోరు మరమ్మతుకు గురికావడంతో దానిని రిపేరు చేసే క్రమంలో ప్రమాదవశాత్తు 12కెవి లైను మీద బోరుపైభాగం వెళ్లి పడింది. దీంతో దాన్ని పట్టుకుని ఉన్న పెద్దిరాజు షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు అతడిని ద్వారకాతిరులమల పీహెచ్‌సీకి తరలించగా పరీక్షించిన వైద్యులు ప్రవీణ్‌కుమార్ మృతిచెందినట్లు ధ్రువీకరించారు.

రైళ్లలో ఆకస్మిక తనిఖీ

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్టు

అరెస్టయిన వారిలో డిగ్రీ చదివే విద్యార్థిని

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైళ్లల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని ఏలూరు రైల్వే పోలీసులు ఈనెల 5వ తేదీ రాత్రి అరెస్టు చేశారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు ఏలూరు పెద్ద రైల్వే పోలీస్ స్టేషన్‌లో ప్లాట్ ఫామ్ ఒకటి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైల్వే ఎస్‌ఐ కె శివన్నారాయణ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించగా బ్యాగ్‌లతో ఉన్న ఒక యువతి, ఒక యువకుడు, ఒక మహిళ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీలు చేశారు. వారి వద్ద 34.50 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ 17 లక్షల 33 వేల 250 రూపాయలు ఉంటుందని గుర్తించారు. అరెస్టయిన నిందితులు కర్నాటక రాష్ట్రం హస్సాన్ జిల్లా బెల్లూరు గ్రామానికి చెందిన హెచ్‌ఎస్ రవి ప్రస్తుతం కాకినాడలోని సర్పవరం జంక్షన్ రమణయ్యపేట మార్కెట్ వద్ద ఉన్న ఇంద్ర కాలనీలో నివాసం ఉంటున్నాడు. రెబకాగణేష్ (18) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. చెన్నైలోని తమిళనాడుకు చెందిన ఈ యువతిని, మరో మహిళ చెన్నైనకు చెందిన మునియమల్ మనోగరామ్ అనే వృద్ధురాలిని అరెస్టు చేశారు. వీరు కాకినాడ నుంచి గంజాయిని రైలులో తీసుకుని ఆ బ్యాగ్‌లతో రైలులో ప్రయాణిస్తూ చెన్నైలోని సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు ముందుగానే అక్కడ సిద్ధంగా ఉన్న గంజాయి కొనుగోలు దారులకు ఆ బ్యాగ్‌లను రైలు నుంచి విసిరివేస్తారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు అరెస్టు చేసిన గంజాయి నిందితులు



ఆవుల్ని లారీలో కుక్కి పెట్టిన దృశ్యం

అక్రమంగా పశువుల తరలింపు

పట్టుకున్న పోలీసులు

జీలుగుమిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గస్తీ నిర్వహిస్తున్న పోలీస్‌లు అక్రమంగా పశువుల్ని తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. జీలుగుమిల్లి సమీపంలోని రమణక్కపేట వద్ద రాత్రి సమయంలో ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఒక లారీలో పశువుల్ని తరలిస్తుండగా అనుమానం వచ్చి తనికీ చేయగా పశుల్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నల్లజర్ల, డింబరు 6 (ఆంధ్రజ్యోతి):నల్లజర్ల మండలం పుల్లలపాడు బైపాస్ రోడ్డుపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ఎర్రంపల్లి గ్రామానికి చెందిన శాయలి శివరామకృష్ణ(20)అక్కడక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శివరామకృష్ణ ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాలలో చదువుకుంటున్నాడు. ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో నల్లజర్ల వైపు వస్తుండగా పుల్లలపాడు వద్ద గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. శివరామకృష్ణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మోహన్‌రావు తెలిపారు.



దొంగ నుంచి స్వాధీనం చేసుకున్న సామగ్రిని చూపుతున్న రైల్వే పోలీసులు

దొంగ అరెస్టు

భీమవరం క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అక్టోబర్ నెలలో 1, 17వ తేదీల్లో ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌లో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు భీమవరం గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నరసాపురం మండలం చిన్న మామిడిపల్లి గ్రామానికి చెందిన యర్రంశెట్టి సతీష్ ధర్మవరం రైలులో ల్యాప్‌టాప్, రూ.5 వేల నగదు, బ్యాంక్ పాస్‌బుక్, 6 సెల్‌ఫోన్లు దొంగిలించడంతో బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి యర్రంశెట్టి సతీష్‌ను అరెస్ట్ చేశామన్నారు. అతని వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఎక్సైజ్ దాడులు: ఇద్దరిపై కేసు

చింతలపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీ నాగిరెడ్డిగూడెం గ్రామంలో శనివారం డ్రోన్ ద్వారా దాడులు, తనిఖీలు నిర్వహించారు. వడిత్యా లక్ష్మీ నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వడిత్యా మణి వద్ద పది లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. వీరిరువురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని అదృశ్యం

నూజివీడు టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పీయూసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అదృశ్యం అయిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఏలూరు జిల్లా తడికలపూడి గ్రామానికి చెందిన మైనర్ విద్యార్థిని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో భాగంగా పీయూసీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. క్యాంపస్‌లోని కే4 హాస్టల్లో వసతి పొందుతున్న ఆమె శుక్రవారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో నూజివీడు పట్టణ పోలీసులకు ట్రిపుల్‌ఐటీ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు నూజివీడు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల ఇళ్లపై దాడి

భీమడోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పూళ్ళ గ్రామంలో వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగిన పాతల నాగరాజు హత్య గ్రామంలో చిచ్చు రేపింది. మృతుడికి సానుభూతిపరులైన గ్రామస్థులు నిందితుల ఇళ్లపై దాడులకు దిగారు. సామగ్రిని ధ్వంసం చేశారు. పూళ్ళ గ్రామంలో ఈనెల 2వ తేదీన పాతల నాగరాజును కాండ్రు ఇస్సాకు మరో ముగ్గురు కత్తులతో దాడి చేసి హత్య చేశారు. నేపథ్యంలో నిందితులు నలుగుర్ని భీమడోలు పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అయితే మృతుడు నాగరాజుకి సానుభూతి పరులైన గ్రామస్థులు 5వ తేదీ అర్ధరాత్రి నిందితుడు కాండ్రు ఇస్సాకు, ఇతని సోదరుడు రాజు ఇళ్ళపై దాడి చేశారు. ఇంట్లో సామగ్రిని ధ్వంసం చేసి బయటపడేశారు. రోడ్డుపైన ఉన్న కారుకు, కిళ్ళీ కొట్టు, కోళ్ళ షెడ్‌లకు నిప్పంటించారు. పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.



దగ్ధమైన కారును పరిశీలిస్తున్న పోలీసులు

19 మంది అరెస్టు

ఇళ్లపై దాడి చేసి సామగ్రి ధ్వంసం చేసి షెడ్‌లకు నిప్పంటించిన 19 మందిని అదుపులోకి తీసుకున్నట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. వీరిలో బొల్లారపు పవన్‌రాజ్ కుమార్ మరో 18 మంది ఉన్నట్లు సీఐ విల్సన్ తెలిపారు. ఘటన ప్రదేశాలను సీఐతో పాటు ఎస్‌ఐ మదీనా బాషా పరిశీలించారు.

జాతీయ రహదారిపై మంటల్లో కారు దగ్ధం

హనుమాన్‌జంక్షన్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వీరవల్లి బైపాస్ వద్ద కారులో మంటలు చెలరేగి దగ్ధమైన ఘటన శనివారం ఉదయం జరిగింది. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడ వెళుతున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో అందులో ప్రయాణిస్తున్నవారు అప్రమత్తమై రోడ్డు పక్కన నిలిపి బయటకు పరుగులు తీశారు. విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బయలుదేరిన జంగారెడ్డిగూడెం మండలం తాడువాయికి చెందిన ఏడుగురు (ఐదుగురు మహిళలు, ఇద్దరు పురుషులు) వీరవల్లి బైపాస్‌పై కారు ఆగిపోవడంతో పాటు పొగ రావడంతో భయంతో దిగిపోయి రోడ్డు పక్కకు వెళ్లిపోయినట్టు తెలిపారు. స్థానికుల సమాచారంతో హనుమాన్‌జంక్షన్ ఫైర్ ఆఫీసర్ అమరేశ్వరరావు సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే కారు మొత్తం దగ్ధమైంది. ఎస్సై బాధితులను వేరే వాహనంలో తరలించారు.

మృతదేహం గుర్తింపు

పోలవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలం పట్టిసీమ ఫెర్రీ రేవులో గుర్తు తెలియని మృతదేహాన్ని శనివారం మృతుని బంధువులు గుర్తించారు. గురువారం పట్టిసీమ ఫెర్రీ రేవులో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు కనుగొని పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం మృతుని వివరాల కోసం ఫొటోలు సామాజిక ప్రసార మాధ్యమాలు వాట్సప్ గ్రూపుల ద్వారా ప్రచారం చేయడంతో సమాచారం మృతుని బంధువులకు చేరి పోలవరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి చేరుకుని మృతదేహాన్ని గుర్తుపట్టారు. మృతుడు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం రాజంపాలెం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త కొప్పుల సాయిరాం(30) గా గుర్తించారు. గత ఐదు రోజుల క్రితం వ్యక్తిగత పనిపై పోలవరం వచ్చిన మృతుడు ప్రమాదవశాస్తూ గోదావరిలో పడి మృతి చెందినట్లుగా భావిస్తున్నామని మృతుని తల్లి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సీఆర్‌ఆర్‌లో కెరీర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం

ఏలూరు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డవలపింగ్ రియల్ వరల్డ్ స్కిల్స్ త్రూ ఇంటర్న్‌షిప్స్ అనే అంశంపై శనివారం స్థానిక సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాలలో కెరీర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం జరిగింది. ఇంటెర్న్‌షిప్ కాలంలో విద్యార్థులు నేర్చుకోవాల్సిన నైపుణ్యాలు, క్యాంపస్ సెలక్షన్ల గురించి విజయవాడ టెక్షిన్ ఐటి ప్రాసెస్ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాస్ విద్యార్థులకు వివరించారు. సందేహాలను నివృత్తిచేసారు. కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, వైస్ ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: పెదతిరుపతి అన్నదాన ట్రస్ట్‌కు కొయ్యలగూడెం పట్టణానికి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షుడు మంతెన సోమరాజు రూ.10 లక్షల 116 విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు శనివారం ఆయన టీటీడీ దేవస్థానానికి చెక్కును అందజేశారు. టీటీడీ దేవస్థానం చేస్తున్న సేవలకు స్పందించి విరాళం అందజేశారు.



స.హ. చట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం : కలెక్టర్

ఏలూరు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం 20 సంవత్సరాలు వేడుకలు శనివారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం - 2025 అమల్లోకి వచ్చి 20 ఏళ్ల పూర్తయ్యిందన్నారు. ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడానికి, పౌరులకు సమాచార సాధికారితను అందించడానికి ఉద్దేశించిన కార్యక్రమం అని తెలిపారు. ఈ చట్టం ద్వారా ఎంతో మంది ప్రయోజనం పొందుతున్నారని అన్నారు. జేసీ ఎం.జె.అభిషేక్ గౌడ, జిల్లా రెవెన్యూ అధికారి వి విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఏలూరు ఆర్డీవో యం అచ్యుత అంబరీష్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎం.వి.రమణ, డిప్యూటీ కలెక్టర్లు ఎల్ దేవకిదేవి, సర్వే ఏడీ అన్సారీ, జిల్లా కలెక్టరేటు ఏవో యన్‌వి నాంచారయ్య, తహసీల్దార్లు పాల్గొన్నారు.

దత్తత తర్వాత చిన్నారులను మెరుగ్గా చూడాలి

ఏలూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని చిన్నారులు దత్తత తీసుకున్న తర్వాత వారిని మెరుగ్గా చూడాలని, ఆరోగ్య సంరక్షణ నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న దత్తత కార్యక్రమంలో రెండు నెలలు క్రితం ప్రీ అడాప్షన్ పోస్టర్ కేర్ ఇచ్చిన రామ్‌చరణ్ అనే 8 నెలలు బాలుడ్ని తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్‌కు చెందిన దంపతులకు తుది ఆర్డర్‌ను కలెక్టర్ శనివారం అందజేశారు.

కోర్టు మానిటరింగ్ సెల్ సభ్యులకు డీజీపీ ప్రశంసలు

ఏలూరు క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా కోర్టు మానిటరింగ్ సభ్యులు సకాలంలో సాక్ష్యులను న్యాయస్థానాల్లో ప్రవేశపెట్టి 47 కేసుల్లో శిక్షలు విధించడానికి కృషి చేయడంతో వారిని అభినందిస్తూ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రత్యేకంగా ప్రశంసా పత్రాలతో అభినందించారు. వాటిని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అధికారులు, సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు మాట్లాడుతూ 2023 నుంచి ఇప్పటి వరకూ 47 కేసుల్లో శిక్షలు పడ్డాయన్నారు. కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, మహిళా హెడ్‌కానిస్టేబుల్ ఎం.వి.రమణ, హెడ్‌కానిస్టేబుల్స్ కె.ఎస్.ఎన్.మూర్తి, ఎం.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసులుకు అందించారు.

ఘనంగా బ్రాహ్మణ సొసైటీ వార్షికోత్సవం

ఏలూరు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబు ఏర్పాటు చేసిన బ్రాహ్మణ వేల్ఫేర్ కార్పొరేషన్, ఏపీ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ 11వ వసంతంలో అడుగిడుతున్న సందర్భంగా ఏలూరు శాఖ ఆవరణలో శనివారం వేడుకలు నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బ్రాహ్మణ కార్పొరేషన్ నూతన పాలకవర్గ సభ్యులు చెరుకుపల్లి సంతోష్, ఎస్.కృష్ణమోహన్, వేలూరి శ్రీధర శర్మ, ఏపీ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎక్స్ ఛైర్మన్, ఎంటీఎస్ శర్మ పాల్గొన్నారు. బ్యాంకు మేనేజర్ నోరి లక్ష్మీనరసింహం మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన యువత రూ.600 లతో శాశ్వత సభ్యత్వం తీసుకుని, స్వల్ప వడ్డీతో రుణ సౌకర్యం పొందవచ్చన్నారు. సిబ్బంది వేలూరి వెంకట నాగ మాధురి, వాడెల వెంకట సాయి మురళి పాల్గొన్నారు.

సీఎం వరాల పట్ల విభిన్న ప్రతిభావంతుల హర్షం

ఏలూరు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ప్రకటించిన వరాల పట్ల విభిన్న ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు చల్ల పార్థసారథి, ప్రధాన కార్యదర్శి విడుదల యుగంధర్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ద్వారా సుమారు రెండు లక్షల మంది దివ్యాంగులు ప్రయోజనం పొందుతారన్నారు. సహ అధ్యక్షులు నాగేంద్రసింగ్, సహాయ కార్యదర్శులు సంకు రాము, జంగంశెట్టి ప్రసాద్, ఎల్.జ్యోతి, శ్రీకాంత్, ఆనంద్ తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ద్వారకాతిరుమల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని.. తాజాగా సీఎం చంద్రబాబు దివ్యాంగులకు వరాలు ప్రకటించడం హర్షనీయమని గోపాలపురం నియోజక వర్గ దివ్యాంగుల విభాగ అధ్యక్షుడు లక్కాబత్తుల రమేష్ అన్నారు. అలాగే తనకు నియోజకవర్గ అధ్యక్ష పదవి ఇచ్చిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు, ఇతర నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గాలాయగూడెంలో నేడు ఉచిత వైద్య శిబిరం

దెందులూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలాయగూడెం శ్రీ అచ్చమ్మపేరంటలమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు గాలాయగూడెం సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు పూజారి వెంకటరత్నం నాయుడు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి శ్రీసీతారామ విశాల పరపతి సంఘం, హేలాపూరి లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభిస్తారని అన్నారు. గాలాయగూడెం, గంగన్నగూడెం గ్రామాలతో పాటు శివారు గ్రామాల ప్రజలంతా వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందాలని బ్యాంక్ అధ్యక్షుడు వెంకటరత్నం నాయుడు తెలిపారు.

సెయింట్ థెరిస్సా విద్యార్థి సంఘాల నాయకులకు శిక్షణ

ఏలూరు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సెయింట్ థెరిస్సా ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలకు ఎన్నికైన విద్యార్థి సంఘాల నాయకులకు నాయకత్వ లక్షణాలపై రెండ్రోజులుగా ఏలూరులో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, సుపీరియర్, కరస్పాండెంట్ మదర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండెజ్ మాట్లాడుతూ హైదరాబాద్, విజయనగరం, నిడదవోలు, ఏలూరుల్లో నిర్వహిస్తున్న సెయింట్ థెరిస్సా విద్యా సంస్థలకు విద్యార్థి సంఘాల నాయకులుగా ఎన్నికైన 70మంది ప్రతినిధులు విలువ ఆధారిత నాయకత్వం కలిగి ఉండాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సిస్టర్ సుశీల, ఫాతిమారాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌పై దిగుమతి సుంకం పెంచాలి : ఎంపీ



ఏలూరు టూటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్‌పై దిగుమతి సుంకం పెంచి రైతులను ఆదుకోవాలని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో అగర్వాల్‌ను కలిసి ఎంపీ మహేశ్ వినతి పత్రం అందజేశారు. అనంతరం మహేశ్ మాట్లాడుతూ ఆయిల్ పామ్‌కు సాగు ఖర్చులు ఎక్కువయ్యి ధరలు తగ్గి రైతులు నష్టపోతున్నారన్నారు. దిగుమతి సుంకం పెంచడంతో ఆయిల్ పామ్ గెలలు టన్ను ధర రూ.3,200 పడిపోయిందన్నారు. ఎంపీ మహేశ్ అభ్యర్థనకు రాజేశ్ అగర్వాల్ స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

కాపు కల్యాణ మండపం నిర్మిస్తాం : ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాపు సంఘాల చిరకాల వాంఛ కాపు కల్యాణ మండపాన్ని నిర్మిస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. కాపు కులస్థుల ఆత్మీయ సమావేశం ఏలూరులో జరిగింది. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దివంగత బడేటి బుజ్జి ఆశయ సాధన కాపు కల్యాణ మండపం నిర్మించడమేనని అన్నారు. మండపానికయ్యే ఖర్చులో 50శాతం నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించడానికి కృషి చేస్తానన్నారు. ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, ముద్దు కృష్ణ, సత్య నారాయణ, వీర్రాజు, శ్రీనివాసరావు, రామకృష్ణ, ప్రకాశ్, వీరాంజనేయులు, లంకపల్లి దుర్గా ప్రసాద్, గంటా బాబ్జీ, మారం హనుమంతరావు, యర్రంశెట్టి నాగరాజు, రామకృష్ణ, పి.ముకుందరావు పాల్గొన్నారు.

స్క్రైబ్ టైపస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

వేలేరుపాడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):స్క్రైబ్ టైపస్ జ్వరంతో కూడిన వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని వేలేరుపాడు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ హబీబ్ షరీఫ్ తెలిపారు. శనివారం ఆసుపత్రి ఆవరణలో రోగులు, ఇతరులకు ఈ వ్యాధివ్యాప్తిపై అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతాలు, పొదలు, గడ్డి, పంట పొలాలు, కట్టెలు నిల్వ చేసిన చోట అభివృద్ధి చెందుతాయన్నారు. మొదట సాధారణ జ్వరంలాగానే కనిపించినా తరువాత తీవ్రమవుతుందన్నారు. ఈ వ్యాధి భారీన పడితే ఎక్కువగా జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శారీరం నొప్పులు, చేతులు కాళ్లలో బలహీనతలతో పాటు దగ్గు, శ్వాస ఇబ్బందులు వస్తాయన్నారు. శరీరంపై నలుపు మచ్చ లేదా చిన్నబ్లాక్ గాయం కనపడితే వైద్యులను సంప్రదించాలన్నారు. పొలాల్లో పని చేసేవారు అడవికి వెళ్లేవారు కట్టెలు ఎరుకూనేవారు, గడ్డిలో కూర్చునేవారికి ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న చంటి



ఏలూరులో నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

దేశ ఔన్నత్యానికి రాజ్యాంగం దోహదం

బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సభల్లో నాయకుల నివాళులు

జీలుగుమిల్లి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బీఆర్ అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకుని బుట్టాయగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి పౌరుడు రాజ్యాంగ విలువల్ని కాపాడాలన్నారు.

● ఏలూరు రూరల్: ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను భావితరాలు ముందుకు తీసుకెళ్లాలని ఏపీఎస్‌ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పేర్కొన్నారు. శనివారం ఏలూరులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ డిప్యూటీ మేయర్ శిరిగిపల్లి శివరామకృష్ణ ప్రసాద్, నగర అధ్యక్షులు వీరంకి పండు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కావూరి వాణిశ్రీ పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్: అగ్రహారంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో శనివారం బీఆర్.అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు.అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాన్ని భిన్నత్వంలో ఏకత్వంగా నిలబడడానికి అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు. అంబేద్కర్ చరిత్రను సమాజంలో ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో అవగాహన చేసుకుని భావితరాలకు తెలియచేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చింతలపూడి: బీఆర్.అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని నగర పంచాయతీలో పలు చోట్ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద అంబేద్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక పాతబస్టాండ్‌లో దళిత సంఘ నాయకులు, ముస్లిం సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● బుట్టాయగూడెం: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టరు బీఆర్.అంబేద్కర్ వర్ధంతిని మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.మనేంద్రరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అధ్యాపకులు ఎం.వెంకటేశ్వరరావు, అక్కులన్న విద్యార్థులు పాల్గొన్నారు. దళితపేటలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కెవిపిఎస్ జిల్లా నాయకుడు ఎ.ఫ్రాన్సిస్ పూలమాలవేసి నివాళులర్పించారు. బి.డేవిడ్‌రాజు, బి.విజయరాజు, దాసు, జి.వెంకటరావు పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: దేశపౌరులందరికీ సమానహక్కులు కల్పించేలా బీఆర్.అంబేద్కర్ రాజ్యాంగానికి రూపకల్పన చేశారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ సమాజంలో అందరికీ సమాన హక్కులు కల్పించారన్నారు. ఏపీ మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ అంబేద్కర్ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

● పెదవేగి: భారతరత్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని దుగ్గిరాలలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుంజా క్రీస్తుమణి మధుబాబు, మాజీ ఉప సర్పంచ్ చింతమనేని సతీష్, టీడీపీ నాయకులు ఇప్పిలి వెంకటేశ్వరరావు, కొనకళ్ల శివమణి, పెనుబోయిన మహేష్‌యాదవ్, దేవరపల్లి ఆదామ్ తదితరులు పాల్గొన్నారు.


విత్తన ముసాయిదా చట్టం సరికాదు

పోలవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విత్తన ముసాయిదా చట్టాన్ని ఉప సంహరించుకోవాలని ఏపీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. శనివారం పోలవరం మండలం మనుగోపలలో రామాలయం వద్ద రైతు కూలీ సంఘంతో కలిసి ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనాలు కలిగేలా కేంద్రం చట్టాలు చేస్తోందని అన్నారు. కోటం బుచ్చమ్మ, కారం దుర్గ, సున్నం అరవాలరాజు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రైసైకిళ్ల అందజేత

వేలేరుపాడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వేలేరుపాడు మండలంలోని మేడేపల్లి పంచాయతీలో ఉన్న దివ్యాంగులకు హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ విజయవాడ ఆధ్వర్యంలో 8మందికి ట్రైసైకిళ్లను ట్రస్ట్ ఛైర్మన్ వెంకట్ అందించారు. మేడేపల్లిలో ముగ్గురు, కమ్మరిగూడెం గ్రామంలో ఐదుగురుకి 8సైకిళ్లు పంపిణీ చేశామన్నారు. ట్రస్ట్ సభ్యురాలు హిమబిందు, కూటమి నాయకులు జాబిలి ఆనందరావు, కొవ్వాల క్రాంతికుమార్, ఏళ్ల శంకరరావు, లక్ష్మయ్య, మహేశ్, మేడేపల్లి సర్పంచ్ కట్టం రాంబాబు పాల్గొన్నారు.




దెందులూరులో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

దెందులూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారమని బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే బాల్య వివాహమని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) చైల్డ్ మారేజ్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్ అన్నారు. శనివారం దెందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వడ్లపట్ల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బాల్య వివాహ విముక్త భారత్ అనే కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై అవగహన కల్పించారు. బాల్య వివాహాల కలిగే అనర్థాలపై అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. దెందులూరు హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పెదవేగి: కనీస వయస్సు లేకుండా వివాహం చేస్తే వారి భావి జీవితంతో పాటు పుట్టబోయే పిల్లల ఆరోగ్యంపై కూడా పడుతుందని చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) చైల్డ్ మ్యారేజ్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ అన్నారు.పెదవేగి మండలం దుగ్గిరాలలోని సెయింట్ డీ పాల్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల 100రోజుల క్యాంపెయిన్‌లో భాగంగా శనివారం బాల్య వివాహ విముక్త భారత్ ఆవశ్యతపై ర్యాలీ చేసి, బాల్యవివాహ వ్యవస్థకు వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో ఎన్‌సీసీ ఏఎన్‌వో సీహెచ్.తంబిరాజ్ కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ వై.వెంకట రాజు, డీసీపీయుఎస్.సునీత, క్రాఫ్ట్ సీఎస్‌డబ్ల్యూ జి.రాజ్యలక్ష్మి, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు గ్యాస్ పొయ్యిల పంపిణీ



కొయ్యలగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత గ్యాస్ అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లిన నిర్మలా కిషోర్ అన్నారు. శని వారం స్థానిక శ్రీసాయి శ్రీనివాస లక్ష్మి సరోజిని గ్యాస్ కంపెనీ వద్ద ఉచిత గ్యాస్ పొయ్యిలను పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు డీ.శ్రీనివాస్, బీజేపీ అధ్యక్షుడు గొలిశెట్టి శ్రీనివాస్, పట్టణ జనసేన అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, టీడీపీ నాయకురాలు జి.మేఘలాదేవి పాల్గొన్నారు.

పోలవరాన్ని జిల్లా కేంద్రం చేయాలి

పోలవరం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): పోలవరం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలని సాధన ఐక్య వేదిక డిమాండ్ చేసింది. శనివారం డాక్టర్ బీఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మాల మహానాడు నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సొబ్బన ఆనందరావు, పోలవరం జిల్లా సాధన ఐక్య వేదిక నాయకులు సొబ్బన మోహన్, బీరా విజయబాబు పోలవరం కేంద్రంగా జిల్లా చేయాలన్నారు. కమ్మరగూడేనికి చెందిన పుచ్చకాయల రవి అనే దళితుడు అంబేద్కర్ స్ఫూర్తితో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించడంతో శాలువాతో సన్మానించారు.

ఇటుకలకోట వద్ద ధర్నా..

పోలవరం నియోజకవర్గంలోని గ్రామాలను చేర్చాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. శనివారం పోలవరం మండలం ఇటుకలకోట గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలో కొయ్యలగూడెం, గోపాలపురం, జంగారెడ్డిగూడెం మండలాలలో ఉన్న 28 నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను చేర్చాలని కోరారు. మండల కమిటీ సభ్యులు తామా బాలరాజు, కొమరం పోసీరత్నం, సముద్రాల సాయికృష్ణ, దర్మల లక్ష్మి, సున్నం వెంకటేశ్వరరావు, యం సుధారాణి, ఇంద్రావతి, సరోజిని, భీమరాజు, వెంకటలక్ష్మి, శ్రీనివాస్, వీరాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు బెంచీలు అందజేత

పెదవేగి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం విజయరాయిలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.1.30 లక్షలతో 30 బెంచీలను పూర్వవిద్యార్థులు అందజేశారు. శుక్రవారం మెగా పీటీఎం నిర్వహించగా వంగా సుబ్బారెడ్డి కూడా వచ్చారు. పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరడంతో సుబ్బారెడ్డి పాఠశాలకు బెంచీలు అందించారు. ప్రస్తుతం ఆ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడిగా ఉన్న ఆ పాఠశాల పూర్వ విద్యార్థి ఎస్.శటారీ తనతో చదువుకున్న 1975-76, 1978-79 ఏడాది విద్యార్థుల సహకారంతో మరో 40 బెంచీలు, 16 టేబుళ్లను సమకూర్చారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటరమణ, విజయరాయి సొసైటీ ఛైర్మన్ బొప్పన సుధాకర్ పూర్వవిద్యార్థులను ఘనంగా సత్కరించారు.

ఆపదలో ఉన్నవారికి ప్రభుత్వం చేయూత



చెక్కు అందజేస్తున్న నాయకులు

కొయ్యలగూడెం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి కూటమి ప్రభుత్వం చేయుత అందిస్తుందని మండల జనసేన అధ్యక్షుడు తోట రవి అన్నారు. శనివారం స్థానిక పట్టణంలో సటపర్తి విజయ్‌కి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆయన అందజేశారు. పట్టణ జనసేన అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను పాల్గొన్నారు.



అప్‌గ్రేడ్ పత్రాలు పొందిన మహిళలతో చింతమనేని

మినీ అంగన్వాడీల గ్రేడ్ పెంపు

ద్వారకాతిరుమల/ చింతలపూడి/ కామవరపుకోట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల అభివృద్ధికి కార్యకర్తలు నిరంతరం పాటుపడాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సూచించారు. ద్వారకాతిరుమల మండలంలోని ఏడు మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా మారుస్తూ అప్పాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. చింతలపూడి నియోజకవర్గంలోని 38 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు ఎమ్మెల్యే రోషన్ కుమార్ పత్రాలు అందజేశారు. చింతలపూడి ఐసీడీఎస్ పరిధిలో 27 మినీకేంద్రాలు, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట మండలాలకు చెందిన 11 కేంద్రాలను ఈ మార్పు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లచే బాల్య వివాహముక్త భారత్ 100 రోజులు భాగంగా ప్రతిజ్ఞ చేయించారు. జంగారెడ్డిగూడెం పట్టణ టీడీపీ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, చింతలపూడి అధ్యక్షులు టి.అప్పారావు, చిట్లూరి దర్మరాజు, మాటూరి వెంకట్రామయ్య, పి.రామారావు పాల్గొన్నారు. కామవరపుకోట మండలంలో ఎనిమిది మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా చేశారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన కార్యకర్తలు, సూపర్ వైజర్లు బి.వి.ఎల్.మంగాదేవి, వీరకుమారిలు సంయుక్తంగా శనివారం మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ వద్దకు వెళ్లి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

● పెదవేగి : నియోజకవర్గంలోని పెదవేగి, పెదపాడు, దెందులూరు మండలాల్లో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయిన 18 మినీ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు పదోన్నతి ఉత్తర్వులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. పెదపాడు సీడీపీవో షేక్ ఫాతీమున్నీసా బేగం, సూపర్‌వైజర్లు పార్వతి, మేరీబాయి, శాంతారత్నం పాల్గొన్నారు.

అంగన్‌వాడీల జీతాలు పెంచాలి

చింతలపూడి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు వేతనాలు పెంపు, సంక్షేమ పథకాల అమలు, యాప్‌ల నిర్వహణ కోసం 5జీ సెల్‌ఫోన్‌లు ఇవ్వాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ పీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు ఆర్.మరియమ్మ, పి.బాబు మాట్లాడుతూ 2023లో 42 రోజులపాటు సమ్మె చేస్తే వేతనాలు పెంచుతామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని, వాటిని అమలు చేయలేదన్నారు. ఈనెల 12న ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన జరుపుతామని పేర్కొన్నారు.

విద్యార్థులకు భోజన ప్లేట్లు బహూకరణ

ఏలూరు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం చాటపర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గిడుతూరి వెంకటరమణ - కల్పన దంపతులు భోజనం ప్లేట్లు శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి వేణు గోపాల్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు భోజనం ప్లేట్లు బహూకరించడం పట్ల వారిని అభినందించారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

సాయి ఈశ్వరాచారి మృతికి బీసీ నేతల నివాళి

ఏలూరు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బీసీలకు సామాజిక న్యాయం చెయడంలో విఫలమైన కారణంగానే తెలంగాణలో సాయి ఈశ్వరాచారి ప్రాణత్యాగానికి పాల్పడ్డాడని ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరవాలని బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో అన్యాయం జరుగుతుందని మనస్తాపానికి గురై ఆత్మాహుతికి పాల్పడిన సాయి ఈశ్వరాచారి సంఘటనపై శనివారం స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని సంఘ కార్యాలయంలో బీసీ జేఏసీ నాయకులు సమావేశమై ఈశ్వరాచారికి నివాళులర్పించారు. ఈసందర్భంగా బీసీ నేత ఎల్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటికైనా బీసీల జనాభాను గణించి దామాషా ప్రకారం ఏబీసీడీలుగా వర్గీకరించి అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ ప్రధాన కార్యదర్శి ఎ.శివకేశవరావు, శివశ్రీ, ఆంధ్రప్రదేశ్ బీసీ జేఏసీ నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, విశ్వబ్రాహ్మణ జేఏసీ కార్యదర్శి త్రినాథ్, బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు లక్కోజు గోపి పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేస్తాం

చింతలపూడి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసే ప్రక్రియ చేపట్టామని పార్టీ పరిశీలకులు లంకా రత్నారావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సమక్షంలో కొన్ని బూత్‌లలో పార్టీ పరిస్థితిపై సమీక్షించారు. ఇక్కడ బలోపేతం చేపట్టాల్సిన చర్యలపై మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై కార్యకర్తలు ప్రజలకు తెలియజేయాలన్నారు. విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేసేలా ముందుకు సాగాలని సూచించారు. మండల, పట్టణ బూత్ కన్వీనర్లు, యూనిట్ అధ్యక్షులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

నిడమర్రు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనికేపల్లి గ్రామ శివారులో పొలాల గట్టుమీద పేకాడుతున్న ఐదుగురిని పట్టుకుని వారి నుంచి రూ.7,100 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులపైకేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జీలుగుమిల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం రూ.11,76,125 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. జనసేన పార్టీ మండలాధ్యక్షులు పసుపులేటి రాము, గుణపర్తి చిన్ని ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

పోలవరం:సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కూటమి ప్రభుత్వ సేవాదక్షతకు నిదర్శనమని ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. శనివారం పోలవరం మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షులు మంగిన కొండ ఆధ్వర్యంలో జరిగిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు సొసైటీ అధ్యక్షులు నునకాని రాంబాబు, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు పాదం ప్రసాద్, ఎస్సీ నాయకులు యడ్ల వినోద్, రెల్లి కొండబాబు,పిల్లి నాగరాజు, పోతుల శ్రీను పాల్గొన్నారు.



రామన్నపాలెంలో అగ్నిప్రమాదం

కామవరపుకోట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం రామన్నపాలెంలో గెడ్డం వసంతరావుకు చెందిన 400 గడ్డి కట్టలు, ఒక షెడ్డు, పైపులు అగ్నికి ఆహుతి అయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

ఎమ్మెల్యే ఇంటి నిర్మాణం ప్రారంభం

లింగపాలెం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సొంతింటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. శనివారం వేదపండితులు ఆయనచేత భూమిపూజ చేయించారు. మండలంలో కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా ఇంటి నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తెలిపారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

టి.నర్సాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండివారిగూడెంలో నందిన వీరభద్రం అనే రైతు రెండు సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుని అనధికారంగా వ్యవసాయ బోరుకు వినియోగిస్తున్నారనే సమాచారంతో విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో వీరభద్రం అనే రైతు తన వ్యవసాయ భూమిలో మోటార్లకు అక్రమంగా విద్యుత్ వాడుతుండటంతో విజిలెన్స్ అధికారులు రైతు వీరభద్రంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో విజిలెన్స్ అధికారులు మూర్తి పాల్గొన్నారు.

ఏలూరులో లోబ్రిడ్జి మూసివేత

ఏలూరుటూటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పవర్‌పేటను ఆర్‌ఆర్.పేటను కలిపే లోబ్రిడ్జి అప్రోచ్ రోడ్డు మరమ్మతుల కారణంగా ఈ నెల 7వ తేదీ నుంచి 15 రోజుల పాటు లోబ్రిడ్జిని మూసివేస్తున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. అప్రోచ్ రోడ్డు గుంతలుపడిన కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. అందుకే మరమ్మతులు చేపట్టామన్నారు.

అంకమ్మ వారి సూత్రాల చోరీ

ఆగిరిపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మసీదు సమీపంలో ఉన్న అంకమ్మ ఆలయంలో చోరీ జరిగినట్లు ఆలయ నిర్వాహకుడు పామర్తి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ కె శుభశేఖర్ వివరాల ప్రకారం పామర్తి వారి అంకమ్మ ఆలయంలో రూ. 50 వేల విలువగల అమ్మవారి బంగారు సూత్రాలు అపహరణకు గురైనట్టు ఆలయ నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముసునూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లబోయినపల్లి, అన్నపనేని వారిగూడెం గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ గౌరినాయుడు తెలిపారు. చిల్లబోయినపల్లి సబ్‌స్టేషన్‌కు వచ్చే విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఈ రెండు గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సహకార ఉద్యోగుల నిరసన



హైదరాబాద్‌లో ముదినేపల్లి బ్రాంచ్ పరిధిలోని సీఈవోల నిరసన

ఏలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్య లను పరిష్కరించాలని కోరు తూ సొసైటీల్లో పనిచేసే ఉద్యో గులు జిల్లా వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 258 సొసైటీల్లో 1400 మంది ఉద్యోగులు, సిబ్బంది ఆందోళనకు దిగారు. నెల్లాళ్లు దశలవారీగా ఆందోళనలకు పిలుపు నిచ్చిన ఉద్యోగులు తమ విధులకు హాజరవుతూనే నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు.

ముదినేపల్లి: ముదినేపల్లి సహకార బ్యాంకు పరిధిలోని నాలుగు పీఏసీఎస్‌ల ఉద్యోగులు హైదరాబాద్‌లో శనివారం నల్లబ్యాడ్జీలతో ప్రదర్శన నిర్వహించారు. సహకార బ్యాంకు పలు అంశాలపై దశలవారీగా పీఏసీఎస్ సీఈవోలకు హైదరాబాద్‌లోని సహకార కేంద్రంలో శిక్షణ ఇస్తున్నది. ముదినేపల్లి సహకార బ్యాంకు బ్రాంచ్ పరిధిలోని దేవపూడి, వాడవల్లి, గోకినంపాడు, ముదినేపల్లి పీఏసీఎస్‌ల సీఈవోలు పి. శ్రీనివాసరావు, కె. నాగమునీంద్రరావు, పి. శ్రీనివాసరావు, ఎ. దుర్గారావు రెండో దశలో శిక్షణకు వెళ్ళారు. ఉద్యోగుల అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి శనివారం నుంచి ఆందోళన కార్యక్రమాలు ప్రకటించడంతో హైదరాబాదులోనే ఉన్న పై నాలుగు పీఏసీఎస్‌ల సీఈవోలు శిక్షణా కేంద్రం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను ప్రకటించారు.

వాలీబాల్ పోటీలకు కైకలూరు విద్యార్థులు

కైకలూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు కైకలూరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీలత తెలిపారు. ఇటీవల కృష్ణా వర్సిటీలో జరిగిన అంతర కళాశాలల వాలీబాల్ పోటీల్లో కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించగా విద్యార్థులను శనివారం కైకలూరు కళాశాలలో అభినందించారు. ఈ నెల 10 నుంచి కాకినాడ జెఎన్‌టీయూలో దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కృష్ణా వర్సిటీ జట్టులో కళాశాలకు చెందిన ఇంటి సాగర్‌బాబు, పూర్ణసాయి అర్హత సాధించారు. విద్యార్థులను, వ్యాయమ అధ్యాపకుడు ఎం. శివనాగరాజును అభినం దించారు.

సురక్షిత తాగునీరు అందించండి: కామినేని



కైకలూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలోనూ సురక్షితమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ కైకలూరు పట్టణంలో ప్రధానంగా శుద్ధి చేసిన జలాలను అందించేందుకు రూ.17లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మైక్రో ఫిల్టర్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అలాగే ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్‌ను వినియోగంలోకి తేవాలని, ప్రతీరోజూ క్లోరినేషన్ చేసిన నీటినే విడుదల చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మంచినీటి సమస్యలను అధిగమించేందుకు త్వరలో ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజనీర్‌తో సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. జలజీవన్ మిషన్లో పనులు ఏ మేరకు జరిగాయో ఆరా తీశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, రాష్ట్ర చేపలరైతు సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, ఎంపీపీ అడవి కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి బేబీ వార్మర్ వితరణ

కలిదిండి: మూలలంక పీహెచ్‌సీలో రెడ్డి అండ్ రెడ్డి సంస్థ వితరణగా అందించిన రూ.60 వేలు విలువ గల బేబీ వార్మర్‌ను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. పీహెచ్‌సీలో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మాజీ ఎంపీపీ లక్ష్మీతులసిరావు, మాజీ బీసీ చైర్మన్ వెంకటేశ్వరరావు, బోళ్ల ఏడుకొండలు, సర్పంచ్ మహదేవ విజయ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : కామినేని



పురాతన ఆల యాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మె ల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం పెదలంక షష్ఠి ఉత్సవాల ము గింపు సందర్భంగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. తొలుత ఆలయ ఈఓ సింగనపల్లి శ్రీనివాసరావు, అర్చకులు నాగేంద్రశర్మ, పూర్ణకుం భంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో స్వామివారి ఆలయ స్థలంలో కల్యాణ మండపం నిర్మిస్తామని, మండపంలో వివాహాలు చేసు కోవచ్చన్నారు. పాతాళ భోగేశ్వర స్వామి ఆలయ ప్రాకార మండపం నిర్మాణ పనులు ప్రారంభ మయ్యాయని, ఆలయ ఆవరణ మెరకకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అభయాంజనేయుడికి మంత్రి సారథి పూజలు



చాట్రాయి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ శివారు సూరంపాలెం అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆశీర్వచనాలు అంద జేశారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని మొక్కుకున్నట్లు మంత్రి తెలిపారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపనా చౌదరి, కూటమి నాయకులు మందపాటి బసవారెడ్డి, కందుల కృష్ణ, ములగలపాటి శ్రీనివాసరావు, తల్లాడ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సమగ్ర యాజమాన్యంతో నాణ్యమైన మామిడి



చాట్రాయి/నూజివీడు టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించటం దాకవరా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని నూజివీడు మామిడి పరిశోధనా స్థానం కీటక శాస్త్రవేత్త జి. శాలిరాజు అన్నారు. చిత్తపూరు గ్రామ సచివాలయంలో శనివారం మామిడి తోటల్లో యాజమాన్యంపై రైతులకు అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మామిడి పూత రావటానికి మల్టీకే 13:00:45 10 గ్రాములు, బోరాన్, జింక్ సల్ఫేట్ 2 గ్రాములు ఒక లీటరు నీటికి, క్లోరోఫైరిఫాస్ 25 ఈసీ 2.5 ఎంఎల్ ఒక లీటర్లు నీటికి, గమ్ 0.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఉద్యాన అధికారి ఆర్. హేమ మాట్లాడుతూ మామిడి కవర్లు 50 శాతం రాయితీపై ఇస్తామని, ఒక హెక్టారుకు 15 వేల కవర్లు ఇస్తామని వీటి ఖరీదు రూ. 30 వేలుకు రూ. 15 వేలు సబ్సిడీ, కూలి ఖర్చుల రాయితీ రూ. 6,250 మొత్తం రైతుకు ఒక హెక్టారుకు రూ 21,250 వస్తుందన్నారు. మామిడి కాయలు ఎక్స్‌పోర్టు విధానం కింద రైతులకు ఎక్స్‌పోర్టర్స్‌కి సమన్వయం చేస్తామన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



జనార్దనవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి



కలిదిండి సెంటర్‌లో అంబేడ్కర్‌కు కామినేని నివాళి



ముసునూరు మండల కార్యాలయంలో నివాళులు



కైకలూరులో అంబేడ్కర్ విగ్రహానికి నేతల నివాళి

అంబేడ్కర్ అందరివాడు

వర్ధంతి సందర్భంగా పలువురి నివాళులు

చాట్రాయి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని, అన్ని వర్గాల ప్రజలకు స్వాతంత్ర్య ఫలాలు అందించారని సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, మాల సంక్షేమ సంఘం మండల నాయకుడు దారా రాజు అన్నారు. చిన్నంపేట, జనార్దనవరం గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని దళిత సంఘాలు, నాయకులు ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దారా చంద్రమోహన్, అవినాష్, సుజన రావు, నాగేశ్వరరావు, గొడవర్తి సిసింద్రి, కందుకూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశేష కృషి చేశారని డిప్యూటీ ఎంపీడీవో బీపీ సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి ఆయనతో పాటు ఏవో ఛాయాదేవి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రూపొం దించి దేశానికి దిశానిర్దేశం చూపిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని, ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైసీపీ నూజివీడు నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు తులిమల్లి పావన జ్యోతి సుజనకుమారి అన్నారు. శనివారం స్థానిక హైస్కూల్ కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ లు నాగుల్ మీరా, మల్లంపల్లి రవిశేఖర్, అమ్మవారి గూడెం మాజీ సర్పంచ్ జలసూత్రం కృష్ణ, కోఆప్షన్ సభ్యుడు షేక్ రియాజ్, నాయకులు పాల్గొన్నారు.

కైకలూరు: రాజ్యాంగ సృష్టికర్త అంబేడ్కర్ జీవిత ఆశయం మహోన్నతమైనదని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా కైకలూరు తాలుకా సెంటర్లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అన్నిరకాల స్వాతంత్ర్య ఫలాలు అందించేలా రాజ్యాంగాన్ని అంబేడ్కర్ అందించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్‌మోర్చ అధ్యక్షుడు కీర్తి వెంకటరాంప్రసాద్, ఎస్సీసెల్ నాయకుడు వీరాబత్తిన సుధా, బీజేపీ నాయకులు బోడావుల జగదీష్, బలే చిరంజీవి, బొల్లా శ్యామలరాజు, పెద్దింటి కల్యాణి, ముస్లింమైనార్టీ నాయకుడు ఎండీ ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా కలిదిండి సెంటర్‌లో శనివారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కూటమి నాయకులు దళిత సంఘాల నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగుల అభ్యున్నతికి కృషి చేసిన అంబేడ్కర్ చిరస్మరణీయుడన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ రమాదేవి, డీసీ చైర్మన్‌లు ఎం.భోగేశ్వరరావు, టి.సత్యనారాయణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ అక్కుల వెంకటాచలం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు పాల్గొన్నారు.

ముదినేపల్లి: చిగురుకోటలో శనివారం ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముదినేపల్లి ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు నిమ్మగడ్డ భిక్షాలు, అంబేడ్కర్ యూత్ నాయకులు నివాళులర్పించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు శావా నాగజగన్ బాబూరావు, నాయకులు నివాళులర్పించగా అల్లూరులో అంబేడ్కర్ విగ్రహానికి తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, నాయకులు నివాళులర్పించారు.

11 మంది ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు

నూజివీడు టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు చెందిన 11 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్లను సాధించినట్లు నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్. అమరేంద్రకుమార్ తెలిపారు. శనివారం ట్రిపుల్ ఐటీలో ఆయన మాట్లాడుతూ ఈసీఈ విభాగం తృతీయ సంవత్సరానికి చెందిన విద్యార్థి టెక్సాస్ ఇన్స్ట్రుమెంట్స్ సంస్థలో రూ. 75 వేలు స్టైపెండ్‌తో ఎంపికయ్యాడన్నారు. ఇదే విభాగానికి చెందిన మరో ముగ్గురు విద్యార్థులు అన్లాక్ డివైసెస్ సంస్థల్లో నెలకు రూ. 50 వేలు ఆఫర్‌ను పొందారన్నారు. కెమికల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరానికి చెందిన ఏడుగురు విద్యార్థులు దక్కన్ ఫైన్ కెమికల్స్‌లో రూ. 4.7 లక్షల వార్షిక ప్యాకేజీతో నియమితులయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డాక్టర్ చిరంజీవి, ప్లేస్‌మెంట్ ఫ్యాక్టరీ ఇన్‌చార్జి డాక్టర్ చింతం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి పిన్నమనేని

ఘనంగా షష్టి ఉత్సవాలు

ముదినేపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): షష్టి కల్యాణోత్సవాల సందర్భంగా సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం ఏకాహం ప్రారంభమైంది. అసిస్టెంట్ కమిషనరు గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు పూజలు జరిపారు. మాజీ మంత్రి టీడీపీ నాయకుడు పిన్నమనేని వెంకటేశ్వరరావు షష్టి ఉత్సవాల్లో పాల్గొని పూజలు జరిపారు. గీతం విద్యా సంస్థల కరస్పాండెంట్ కొత్తూరు వేణు, టీడీపీ నాయకులు చలసాని జగన్మోహనరావు, కొత్తూరు విఠల్ తదితరులు పూజలు జరిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆగిరిపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనసానపల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు ఎన్‌ఆర్‌ఐ కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్. వెంకట్రావు అన్నారు. ఎన్‌ఆర్‌ఐ కళాశాల ఆధ్వర్యంలో ఆంధ్రా హాస్పిటల్స్, దుహిత డెంటల్ హాస్పిటల్స్, మాక్స్ విజన్, హియర్ జాప్ సంస్థల సౌజన్యంతో శిబిరం నిర్వహించామన్నారు. సాధారణ వైద్య పరీక్షలు, కంటి, చెవి, దంత తదితర పరీక్షలు మొత్తం 120 మందికి చేశారన్నారు. ప్రిన్సిపాల్ సి. నాగభాస్కర్, సీఈవో తేజ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణలోని భూమిని చూపుతూ విలేకరులతో మాట్లాడుతున్న పవన్, శ్రీకాంత్

మా భూమిని ఇప్పించండి

సమరయోధుడి వారసుల వేడుకోలు

నూజివీడు టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమర యోధుడు, మాజీ ఎమ్మెల్యే అయిన తమ తాతకు ప్రభుత్వం అసైన్ చేసి ఇచ్చిన రెండు ఎకరాల సాగు భూమి ఆక్రమణదారుల చెరలో చిక్కుకున్నదని తమ భూమిని తమకు అప్పగించాలంటూ స్వతంత్ర్య సమరయోధుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు. భూమి తమదేనని కోర్టు తీర్పు ఇచ్చినా నేటికీ ఆక్రమణదారులు సాగు చేసుకుంటున్నారని, అధికారులు తమ వాదన అర్థం చేసుకొని తమ భూమిని తమకు అప్పగించాలంటూ స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే పోతిన చిన్న మనవడు పోతిన పవన్ కోరుతున్నారు. బాధితుల వివరాల ప్రకారం నూజివీడు మండలం సిద్ధార్థ నగర్ గ్రామంలో 1985లో ఎనిమిది మందికి 13 ఎకరాల 25 సెంట్లు భూమి కేటాయించగా అప్పుడు వారు అనుభవించకుండా పలువురికి అమ్ముకోవడం జరిగిందని పిఓటి యాక్ట్ ప్రకారం క్రయ విక్రయాలు నేరం అవ్వడంతో భూమిని కొనుగోలు చేసిన వారి నుంచి రెవెన్యూ అధికారులు మొత్తం 13 ఎకరాలు 25 సెంట్లు భూమిని కొనుగోలు చేసి సాగు చేస్తున్న వారి నుంచి స్వాధీనం చేసుకుని ప్రభుత్వ భూమిగా నమోదు చేశారన్నారు. అనంతరం మాజీ మంత్రి పాలడుగు వెంకట్రావు సమక్షంలో పోతిన చిన్న సతీమణి పైడమ్మకు రెండెకరాలు, పులి శ్రీకాంత్‌కు ఎకరా ఇరవై సెంట్లు, మారగాని పూర్ణచంద్ర హైమవతికి ఎకరం భూమి కేటాయించారన్నారు. అయితే ప్రభుత్వం కేటాయించినా వారిని భూములలోకి రానివ్వకుండా గతంలో అక్రమంగా భూమిని కొనుక్కున్నవారు భూమిని ఆక్రమించి సాగు చేస్తుండటంతో ఈ భూ కేటాయింపుల్లో భూమిని పొందిన వారు కోర్టు ఆశ్రయించగా కోర్టులో వాయిదాలు నడుస్తున్న తరుణంలో ఆక్రమణదారులు భూమిలో సాగు చేయడం చర్చనీయాంశంగా మారింది. మొత్తం ప్రభుత్వం ఆధీనంలో ఉన్న 13 ఎకరాల 25 సెంట్లు భూమిలో నాలుగు ఎకరాల 20 సెంట్లు భూమి అసైన్మెంట్ పట్టాలివ్వగా మిగిలిన భూమి కూడా ఆక్రమణలోనే ఉందని తమకు పట్టాలు, పాస్ బుక్‌లు ఉన్నా తమను భూమిలోకి రానివ్వకుండా ఆక్రమణదారులు సాగు చేసుకుంటున్నారని తమ భూమిని తమకు స్వాధీనం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఈ విషయమై నూజివీడు తహసీల్దార్ భద్రుని వివరణ కోరగా భూ ఆక్రమణదారులు, అసైన్‌మెంట్ పట్టా పొందిన వారి మధ్య భూ వివాదం కోర్టులో ఉంది. భూ సాగు విషయమై ఆక్రమణదారులకు హెచ్చరికలు జారీ చేశారు. భూ వివాద విషయమై నిబంధనల ప్రకారం చర్యలు చేపడతామని నూజివీడు తహసీల్దార్ భద్రు తెలిపారు.

మరొకరికి స్క్రబ్ టైఫస్!

బాధితుడ్ని నూజివీడు నుంచి విజయవాడకు తరలింపు

ఏలూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసు మరొకటి నమోదైంది. తాజాగా నమోదైన కేసుతో జిల్లాలో ముగ్గురు బాధితులు స్క్రబ్ టైఫస్ బారినపడినట్టు అధికారి కంగా రుజువైంది. నూజివీడుకు చెందిన ఓ వ్యక్తి(35) తాపీ పనుల నిమిత్తం రోజూ ఏలూరు రాకపోకలు సాగిస్తుంటాడు. తీవ్ర జ్వరం, మలబద్ధకం సమస్యతో గత నెల 29న నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చేరాడు. ఇతనికి కిడ్నీలో రాళ్ల సమస్య కూడా ఉంది. చికిత్స అందిస్తున్నప్పటికీ జ్వరం అదుపులోకి రాకపోవడంతో శుక్రవారం రాత్రి ఎలీసా టెస్టు నిర్వహించగా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ నిర్ధారణైంది. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం అతనిని శనివారం ఉదయం విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య స్థితి నిలకడగానే ఉందని, ఆందోళన చెందన క్కర్లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడిం చాయి. బాధితుని ఇంటి ఆవరణలోనే పశువుల షెడ్డు ఉండటంతో నల్లిపురుగు వ్యాప్తిచెంది ఉండ వచ్చునని వైద్యవర్గాల అంచనా. ఇప్పటికే టి.నర సాపురా నికి చెందిన ఓ పురుషునికి, పెదవేగి మండలం అమ్మపాలెంకు చెందిన ఓ మహిళకు స్క్రబ్ టైఫస్ నిర్ధారణకాగా, తాజాగా మరొకరు నల్లిలాంటి ఓ రకం పురుగుకాటుకు గురయ్యారు. కాగా ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న అమ్మపాలెంకు చెందిన మహిళకు ఆరోగ్యం కుదుటపడటంతో శనివారం డిశ్చార్జి చేశారు.

జిల్లాల వారీగా ఆర్‌ఆర్‌టీ

రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో సంబంధిత రోగులు నివసించే ఇళ్లవద్దకే వెళ్లి మూలాలను అన్వేషించి, విశ్లేషించేందుకు జిల్లాల వారీగా ర్యాపిడ్ రెస్పాన్సిబిలిటీ టీం(ఆర్‌ఆర్‌టీ)లను నియమించింది. టీంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, జనరల్ మెడిసిన్ వైద్యుడు, పీడియాట్రిక్స్ వైద్యుడు, కమ్యూనిటీ మెడిసిన్ వైద్య నిపుణుడు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఐడీఎస్పీ విభాగం జిల్లా ఎపిడ మాలసిస్టు ఉంటారు. జిల్లాకు నియమించిన ఈ బృందంలో ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి, వైస్‌ప్రిన్సిపాల్/మైక్రోబయాలజీ హెచ్‌వోడి డాక్టర్ శశిధర్, ఎన్సీడీ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ, తదితరులున్నారు.

ఆహారం నాణ్యంగా ఉండాలి : ఎంఈవో

ముసునూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికర ఆహారాన్ని అందించాలని ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు అన్నారు. శనివారం సింహాద్రి అప్పారావు పేట ఎంపీపీ పాఠ శాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని అదృశ్యం

నూజివీడు టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఏలూరు జిల్లా తడికలపూడి గ్రామానికి చెందిన విద్యార్థిని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో చదువుతోంది. క్యాంపస్‌లోని కే-4 హాస్టల్లో వసతి పొందుతున్న ఆమె శుక్రవారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో నూజివీడు పట్టణ పోలీసులకు ట్రిపుల్ ఐటీ అధికారులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి



ఆగిరిపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి (60) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు ఆగిరిపల్లి ఎస్‌ఐ కె శుభశేఖర్ తెలిపారు. మృతుడు శుక్రవారం సాయంత్రం పల్లగాని నాగేంద్రం నర్సరీ ఎదురుగా కూర్చుని ఉన్నాడని శనివారం ఉదయం చూసేసరికి వ్యక్తి మృతి చెందినట్లు గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తి బ్రౌన్ కలర్ చెక్స్ షర్టు, లైట్ గ్రీన్ ప్యాంట్‌తో ఉన్నాడని, కేసు నమోదు చేసి మృతుడిని నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

వీఆర్‌వో విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తిపై కేసు

ముదినేపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ముదినేపల్లి మండలం చేవూరు వీఆర్వో సిహెచ్ రామసుబ్బయ్య శ్రీహరిపురానికి చెందిన బి. భాస్కరరావు అనే వ్యక్తిపై శనివారం ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చేవూరు గ్రామంలో చేపల చెరువు విషయంపై భాస్కరరావుకు వి. శ్రీనివాస్‌కు మధ్య ఉన్న విబేధాలపై తాను విచారణ నిర్వహిస్తుండగా భాస్కరరావు తనపై దౌర్జన్యం చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుండిపోయేలా పొట్టిశ్రీరాములు స్మృతివనం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్. చిత్రంలో ఎమ్మెల్యే కామినేని తదితరులు

కైకలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భావితరాల ప్రజలకు అమరజీవి పొట్టి శ్రీరాములు గుర్తుండిపోయేలా అమరావతి లో స్మృతివనం నిర్మాణం జరుగుతుందని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ అన్నా రు. శనివారం కైకలూరులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి ఆధ్వర్యంలో నియోజకవర్గ ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబు, లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు ఆర్యవైశ్యుల గౌరవం పెంచేలా పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ గ్రామానికి త్వరలో వాసవీ పెనుగొండగా పేరు మార్చి జీవోను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమరావతిలో అమరజీవి పొట్టిశ్రీరాముల స్మృతివనం నిర్మాణానికి 6.8 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిందని ఇందులో వచ్చే మార్చి 16న పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని 58 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్మృతి వన నిర్మాణానికి అమరజీవి పొట్టిశ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నామని ఈ ట్రస్ట్ ద్వారా విరాళాలను అందించాలనుకునే వారు నేరుగా ఆన్‌లైన్లోనే అందించాలన్నారు. అలాగే 500 మంది ఆర్యవైశ్య పేద విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లు, ఉచిత వైద్యాన్ని అందించడంతో పాటు పీఎస్సీర్ మెమోరియల్ అవా ర్డులను అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు సముచిత న్యాయం లభించిందన్నారు. అలాగే స్థానికంగా ఆర్యవైశ్యులకు తన సహకారాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, ఆర్యవైశ్య సంఘం నాయకులు గుర్రం శ్యాం, పైడిమర్రి రమేష్, ఊర శ్రీధర్, కొండలు, అద్దేపల్లి బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.